విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759


RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందిరి హక్కు...
# పెన్ సత్తా
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :54 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 17 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్

- పీపీపీ ప్రాజెక్టుల్ని సస్టైనబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలి
- రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై అధికారులతో చర్చ
- మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టిన ప్రభుత్వం



**అమరావతి**

వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే భవిష్యత్‌లో కీలకంగా మారతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం దేశంలో మౌలిక సదుపాయాల విప్లవం నడుస్తోందన్నారు. ప్రభుత్వం వద్ద నిరర్థకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టులు, సర్కార్ చేస్తున్న వ్యయం తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్‌యార్డులు, ఎయిర్‌పోర్ట్‌లు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థికశాఖ ఉన్నతాధికారులు వివరాలు 2లో..



## డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం

- పార్లమెంట్ సమావేశాల్లో అయోధ్య విరాళాల చోరీని ఎండగడతాం
- జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- ఢిల్లీలోని సోనియా నివాసంలో సమావేశమైన కాంగ్రెస్ అగ్రనేతలు
- పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తామని వెల్లడి



## అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం

- 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఆస్కారం
- రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్
- స్థిరం లేని గొడ్డలి పార్టీ నేత మాటలు నమ్మొద్దు
- మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి**

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకొంటున్న అమరావతి రాజధాని నగరం పూర్తయితే లక్ష కోట్ల రూపాయల ఆదాయం ఇస్తుందని, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం ఆయన మున్సిపల్, పట్టణ అభివద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులతో కలసి అమరావతిలో రూపు దాల్చిన ఐకానిక్ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను, అఖిల భారత సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి నారాయణ, శ్రీనివాస రావులతో కలిపి మీడియాతో మాట్లాడారు. అమరావతిపై గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, వివరాలు 2లో..



## హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదు

- భారత్ కీలక ఆదేశాలు
- తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఈ ఆదేశాలను అమలు చేయాలని నిర్దేశం
- భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ వివరణ



## 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

- సీబీఎస్ఈని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- 9వ తరగతిలో మూడో భాష ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం
- 9వ తరగతిలో మూడో భాషను ప్రారంభించడం కాదు, ఆపేయాలన్న కోర్టు
- ఇది విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెంచుతుందని వ్యాఖ్య
- కొత్త భాషను 6వ తరగతిలోనే ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచన

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం



కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

## నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం



- భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులు పూర్తయ్యాయన్న రామ్మోహన్ నాయుడు
- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని కోరాం
- తేదీ ఖరారైన వెంటనే నెల రోజుల్లో విమాన కార్యకలాపాలు ప్రారంభిస్తామని వ్యాఖ్య



## సముద్ర గర్భంలో 392 మీటర్ల లోతున రహదారి

- ప్రపంచంలోనే అతిపెద్ద సబ్‌సీ టన్నెల్..
- నార్వే ఇంజనీరింగ్ అద్భుతం!
- ప్రపంచంలోనే అత్యంత పొడవైన, లోతైన సముద్రగర్భ రహదారి టన్నెల్‌ను నిర్మిస్తోన్న నార్వే
- 27 కిలోమీటర్ల పొడవు.. సముద్ర మట్టానికి 392 మీటర్ల లోతులో ఈ టన్నెల్ నిర్మాణం
- నిర్మాణంలో ఎదురవుతున్న బలహీనమైన రాతి పొరలు, నీటి లీకులు వంటి భౌగోళిక సవాళ్లు
- పశ్చిమ తీరంలో ప్రయాణ సమయాన్ని 40 నిమిషాల వరకు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

- జగన్ అధ్యక్షతన వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్
- ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని మండిపాటు
- అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చూపిస్తున్నారని ఆరోపణ
- ప్రతి రంగంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శ



**అమరావతి**

వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్సీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు వివరాలు 2లో..

# నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉడాన్ 2.0 పథకం అమలు తీరుతెన్నులపై వర్క్‌షాప్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, డీజీసీఏ అనుమతులు వచ్చాయని చెప్పారు. ఉత్తరాంధ్రతో పాటు ఏపీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తేనే న్యాయం జరిగినట్లని అభిప్రాయపడ్డారు. ప్రధాని పర్యటన తేదీ కోసం వేచి చూస్తున్నామని నెలరోజుల్లో విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు. ఉత్తరాంధ్రుల ఎన్నో ఏళ్ల కల భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం. సుమారు రూ.4750 కోట్లతో 2203 ఎకరాలు ఎకరాల్లో దీనిని నిర్మించారు. బోయింగ్ విమానాలు ఎయిర్ బస్, బోయింగ్ విమానాలు సులభంగా ల్యాండయ్యేలా 3,800 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పున కేట్ ఐ -1 రన్‌వే నిర్మించారు. ఐదు వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 25,000ల టన్నుల సరకు రవాణా టెర్మినల్ నిర్మాణం చేపట్టారు.

అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక, సాంకేతికత, భారీ మౌలిక వసతులతో గడువుకు ముందే నిర్మాణం పూర్తైంది. ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్‌లా పర్యాటకం సహా పలు రంగాల ప్రగతి సాధనకు గేమ్ ఛేంజర్‌గా మారనుంది. జీఎంఆర్ సంస్థ ఈ విమానాశ్రయంపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో ఎగిరే చేప ఆకృతిలో ఈ ఎయిర్?పోర్ట్?ను నిర్మించింది. విమానాశ్రయ టెర్మినల్





సీలింగ్ సంప్రదాయ ముగ్గుల థీమ్‌తో అలరిస్తోంది. దీనికి అనుబంధంగా హోటళ్లు, కమర్షియల్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లతో జీఎంఆర్ ఏరో సిటీ అభివృద్ధి చేశారు. విశాఖ నుంచి విమానాశ్రయానికి అనుసంధానంగా చేపట్టిన ఏడు రోడ్లలో ఐదు పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

తొలి దశలో ప్రయాణికుల సామర్థ్యం ఏడాదికి 60 లక్షల మంది విస్తరణ, రెండో దశలో 1.2 కోట్లకు మూడో దశలో పూర్తి స్థాయి అభివృద్ధితో 1.8 కోట్ల మందికి సేవలు చేరువ చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఈ ఎయిర్?పోర్ట్? అందుబాటులోకి వస్తే ప్రయాణికుల రవాణాతోపాటు వ్యవసాయ, సముద్ర, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు ఊపందుకోనున్నాయి. మరోవైపు ఇటీవలే భోగాపురం ఎయిర్‌పోర్ట్?కు కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది. ఇమిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025 పరిధిలోకి ఈ విమానశ్రయాన్ని చేర్చింది. ఈ మేరకు కేంద్రం అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానంలోకి చేరింది. కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఈ నోటిఫికేషన్‌తో ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్ గుర్తింపు పొందింది.

# నవంబర్‌లో లోకల్ బాడీ ఎన్నికలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. రాబోయే నవంబర్ నాటికి లోకల్ పోల్స్ ముగించాలనే పక్కా ప్లాన్‌తో అధికార కూటమి అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇద్దరూ ఇప్పటికే తమ పార్టీల శ్రేణులకు ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. చట్టపరమైన, సాంకేతికపరమైన ప్రక్రియ పూర్తి కాగానే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, దానికి సైనికుల్లా సిద్ధం కావాలని క్షేత్రస్థాయి క్యాడర్‌ను అలర్ట్ చేశారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత సీట్ల కోసం కొట్టుకోకుండా, ముందే గ్రౌండ్ లెవెల్‌లో ఒక అవగాహనకు అంతర్గతంగా వచ్చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో దూసుకుపోవడానికి ప్రధాన కారణం పార్టీ కోసం రక్తం చిందించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే. అందుకే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ గట్టిగా నిశ్చయించుకున్నారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదుర్కొని, పార్టీ జెండా మోసిన నిజమైన లాయల్ కార్యకర్తల పూర్తి సమాచారాన్ని, వారి అర్హతలను జనసేన అధిష్ఠానం ఇప్పటికే సేకరించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక పైరవీలు చేసేవారికి కాకుండా, కష్టపడ్డవారికే టికెట్లు దక్కుతాయి అనే నమ్మకాన్ని పవన్ కిందిస్థాయి క్యాడర్‌లో నింపారు. దీనివల్ల ఆశావహుల్లో గందరగోళం తగ్గి, పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేసే వాతావరణం ఏర్పడింది.మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల కుప్పం, కర్నూలు తదితర ప్రాంతాల సమీక్షా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. లోకల్ పోల్స్‌లో విజయం సాధించడం నాన్-నెగోషియబుల్ అని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో గెలిపించిన నేతలనే పార్టీ నెత్తిన పెట్టుకుంటుందని, ఓడిపోయిన వారిని ఎంతటి వారైనా పక్కన పెడుతుందని కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా తంబళ్లపల్లె వంటి నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల నియామకం, గ్రౌండ్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని లోకేష్, బాబు స్పష్టం చేయడంతో తమ్ముళ్లలో




మునుపెన్నడూ లేని సీరియస్‌నెస్ కనిపిస్తోంది.సాధారణంగా స్థానిక ఎన్నికలు అనగానే అధికార పార్టీల్లో టికెట్ల కోసం అంతర్గత కుమ్ములాటలు, తిరుగుబాట్లు కామన్. పైగా ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఒకే స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ ముప్పును ముందే పసిగట్టిన బాబు-పవన్ ద్వయం.. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సీట్ల సర్దుబాటు ఫార్ములాను ముందే సిద్ధం చేస్తున్నారు. ఏయే గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఏ పార్టీ బలంగా ఉందో ఆ పార్టీకే ఆ సీటు కేటాయించేలా.. జిల్లా స్థాయి మంత్రులు, ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో ముందస్తు స్క్రీనింగ్ కమిటీలు వేస్తున్నారు.సార్వత్రిక ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లోనూ 2024 నాటి కూటమి పొత్తు సెంటిమెంట్‌ను అలాగే కొనసాగించాలని అధినాయకత్వం భావిస్తోంది. పైస్థాయిలో నేతలు కలిసి ఉన్నా, కిందిస్థాయిలో గ్రామాల్లో టీడీపీ-జనసేన క్యాడర్ కలవడం చాలా ముఖ్యం. అందుకోసమే ఉమ్మడి సమన్వయ కమిటీల ద్వారా ఇరు పార్టీల కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తున్నారు. ఈ ముందస్తు సన్నాహాల వల్ల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి కూటమి తరఫున అభ్యర్థులు దాదాపు ఖరారై ప్రచారంలో ఉంటారు. ఇది ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీని మానసికంగా మరింత డిఫెన్స్‌లోకి నెట్టేసే వ్యూహం.ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ వరుస పరాజయాలు, అంతర్గత వలసలతో డీలా పడి ఉంది. ఈ తరుణంలో నవంబర్ లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా కూటమి క్లీన్ స్వీప్ చేస్తే.. విపక్షం పుంజుకునే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయి. అందుకే చంద్రబాబు కమాండర్‌లా తానే ముందుండి నడిపిస్తానని భరోసా ఇస్తుండగా, పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేలా సరికొత్త అభివృద్ధి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ముందస్తు ప్రణాళిక, క్యాడర్‌కు స్పష్టమైన గైడ్‌లైన్స్.. ఇవే నవంబర్

# పట్టిసీమ వివాదంలోకి రేవంత్

**విజయవాడ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నీటిని నిల్వ చేయకుండా కిందకు వదిలేస్తోందని, తద్వారా ఏపీలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి గోదావరి జలాలు సమృద్ధిగా అందేలా చూస్తోందని ప్రతిపక్ష బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబుకు మేలు చేసేందుకే తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్నది ఈ విమర్శల సారాంశం. ఈ నేపథ్యంలో ఈ వాదనలోని సాంకేతిక, భౌగోళిక అంశాలపై ఆసక్తి నెలకొంది. తెలంగాణలోని కన్నెపల్లి మేడిగడ్డ పంప్ హౌస్ నుంచి ఎత్తిపోసే నీరు కిందకు రాకపోవడం వల్లే ఏపీలోని పట్టిసీమకు నీరు అందుతుందనే వాదన ప్రాథమిక భౌగోళిక సూత్రాలకే విరుద్ధం. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత, గోదావరి నదులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద కలుస్తాయి. ఇక్కడే మేడిగడ్డ బ్యారేజీ ఉంది. మేడిగడ్డ దాటిన తర్వాత గోదావరి నది వందల కిలోమీటర్ల మేర ప్రవహించి, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే ఇంద్రావతి, శబరి వంటి భారీ ఉపనదులను కలుపుకుంటుంది. ఈ ఉపనదులన్నీ కలిసిన తర్వాతే గోదావరి నది ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, ఆపై రాజమండ్రి ఎగువన ఉన్న పట్టిసీమ ప్రాంతానికి చేరుకుంటుంది.కాబట్టి మేడిగడ్డ వద్ద నీటిని ఆపినా, ఆపకపోయినా? వర్షాకాలంలో ఇంద్రావతి, శబరి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో కురిసే భారీ వర్షాల కారణంగా వచ్చే వరద నీరు సహజ గ్రావిటీ ద్వారా పట్టిసీమకు చేరుకుంటుంది. జూలై మొదటి వారంలో మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత ద్వారా మేడిగడ్డకు సుమారు 1 లక్ష క్యూసెక్కుల వరద రాగా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం ఆ నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో ఏపీలోని పట్టిసీమ వద్ద గోదావరిలోకి వచ్చిన 56,000 క్యూసెక్కుల వరద జలాల నుంచే జూలై 8న ఏపీ ప్రభుత్వం కృష్ణా డెల్టాకు నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. అయితే దీనికి అనేక సాంకేతిక కారణాలున్నాయి. అక్టోబర్ 2023లో మేడిగడ్డ బ్యారేజ్ 7వ బ్లాక్‌లోని కొన్ని పిల్లర్లు కుంగిపోయాయి. దీనిపై విచారణ జరిపిన ఔఆూం బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోవడం, జియో-టెక్నికల్ సర్వేల్లో లోపాలు ఉన్నట్లు తేల్చింది. ప్రస్తుత స్థితిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పూర్తి స్థాయిలో అంటే 141 మీటర్ల మేర నీటిని నిల్వ చేయడం అత్యంత ప్రమాదకరమని, బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఔఆూం స్పష్టం చేసింది. ఈ మూడు బ్యారేజీల శాశ్వత పునరుద్ధరణ పనులు పూర్తి కావడానికి కనీసం 2 నుండి 3 ఏళ్ల సమయం పడుతుందని అంచనా. నదిలో ప్రవాహం లేని ఎండకాలంలో మాత్రమే కాంక్రీట్ పనులు చేయడం సాధ్యమవుతుంది. ప్రభుత్వం ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని నిపుణుల కమిటీ సూచనల మేరకే గేట్లు ఎత్తి నీటిని కిందకు పంపుతోంది తప్ప, పట్టిసీమకు నీరివ్వాలనే ఉద్దేశంతో కాదు. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ చేస్తే రూ. 1.1 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ఆస్తులకే ముప్పు వాటిల్లుతుంది. రాజకీయ విమర్శల కోణంలో చూస్తే రేవంత్ రెడ్డి ఏపీకి మేలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లోకి వెళ్ళవచ్చు. కానీ, క్షేత్రస్థాయి పరిశీలన, సాంకేతిక నివేదికల ప్రకారం మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయకపోవడానికి ప్రధాన కారణం ఆ

## ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

సీఎంకు వివరించారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌరవిద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టైయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని, ప్రతీ ప్రాజెక్టు వద్ద ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలని తెలిపారు.

విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణాని కేంద్రం రూ.178 కోట్ల మేర వీజీఎఫ్ ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1468 కోట్ల రూపాయల వీజీఎఫ్ రానుందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య పాలసీ 1.0ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి, అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి సంబంధిత మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలనూ అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని అధికారులు, చంద్రబాబుకు వివరించారు. భవిష్యత్?లో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని, సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయని చెప్పారు.

ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ తయారు చేసుకోవాలని స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజీ రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని, పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచనలు చేశారు.

బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశానికి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్?కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్?కుమార్, ఐఅండ్?ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?” అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

## అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం

-మొదటిపేజీ తరువాయి

ఆ పార్టీ ఇతర నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని మంత్రి రామానాయుడు ఖండించారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతి రాజధానిని స్వాగతిస్తున్నానని, 30,000 ఎకరాలు సరిపోవని, తాను ఇక్కడ ఇల్లు కట్టుకుంటున్నానని, అమరావతి రాజధాని కదిలే ప్రసక్తి లేదని జగన్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాలను రామానాయుడు గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే, మాట మార్చి, మడమ తిప్పి మూడు రాజధానులు అంటూ, మూడుముక్కలాట ఆడాడని విమర్శించారు. తాను ప్రతిపాదించిన మూడు రాజధానుల లో మూడు ఇటుకలు కూడా పెట్టకుండా ఐదేళ్ళు కాలయాపన చేశాడన్నారు. దేశంలోనే మొదటి డయా గ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా, తుఫాన్ లు, వంటి ప్రకతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు 12 టవర్లలో 276 ఫ్లాట్స్ 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయని మున్సిపల్ మంత్రి నారాయణ నిమ్మలకు, పల్లాకు చూపించారు. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్ల తో 138 ఫ్లాట్స్ 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని నారాయణ సహచరులకు వివరించారు. చంద్రబాబు నాయకత్వం లో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నామని మంత్రులిద్దరూ, పల్లా శ్రీనివాసరావు చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99.5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీకరించామన్నారు. ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉందని ఇది కేవలం 0.5% మాత్రమేనని రామానాయుడు చెప్పారు. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుదేశ్యం తో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని ఆయన అన్నారు.

## రిటైర్ అయ్యాక మళ్లీ ఉద్యోగం...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్స్ రిటైర్డ్ డైరెక్టర్ వి రంగరాజ్ ఉద్యోగానికి సంబంధించి ఆసక్తికర పరిణామం జరిగింది. వి రంగరాజ్ జూన్ 30న పదవీ విరమణ చేయగా.. ఆయన్ను మళ్లీ తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి రంగరాజ్‌కు 60 ఏళ్లు నిండటంతో నిబంధనల ప్రకారం గత నెల 30న పదవీ విరమణ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల రెగ్యులర్ ఉద్యోగుల (ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్ 9, 10 పరిధిలోకి వస్తారు) పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులు 2022 జనవరి 1 నుంచి వర్తిస్తాయని తెలిపింది.ఏపీ ఆర్కైవ్స్ విభాగం కూడా ఈ పదో షెడ్యూల్ పరిధిలోకి వస్తుంది.. ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రంగరాజ్ ఈ నెల 2న ఈ నిబంధనల ప్రకారం తనకు 62 ఏళ్ల వరకు సర్వీసు పొడిగింపు వర్తిస్తుందని ప్రభుత్వానికి జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆయన్ను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం మీద రంగరాజ్ మరో రెండేళ్ల పాటూ తన ఉద్యోగంలో కొనసాగనున్నారు. రంగరాజ్‌లాగే మరికొందరు కూడా తిరిగి వారి పోస్టుల్లో చేరనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో 2022లో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60

# చెప్పిన తేదీ ప్రకారమే శంకర్ విలాస్ ప్రారంభం పెమ్మసాని.





- చిన్నచిన్న సమస్యలను కూడా పూర్తిగా పరిష్కరిస్తున్నాం.
- గుంటూరుకు అదృష్టం కొద్దీ దక్కిన ఆర్‌ఓబీలు.
- వాటి నిర్మాణానికి అందరూ కట్టుబడి ఉండాలి.
- అందరి సహకారం తోనే ఆర్‌ఓబిల నిర్మాణం పూర్తి.
- శంకర్ విలాస్ బ్రిడ్జ్ పనుల పరిశీలనలో పెమ్మసాని.

**గుంటూరు, పెన్ సత్తా, జులై 16:** నగరంలో నిర్మిస్తున్న శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ విలాస్ నిర్మాణ పనులతో పాటు స్థానిక శ్యామల నగర్ పనులలో జరుగుతున్న జాప్యాన్ని కూడా ఈ సందర్భంగా పెమ్మసాని వివరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం అనుకున్న సమయం లోనే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం అన్నారు. ఉన్న చిన్న చిన్న సమస్యలు అన్నిటిని పరిష్కరించుకుంటూ వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం. 2 - 3 పిల్లర్ల పనుల నిమిత్తం మిగిలిన అన్ని పనులు వేగంగా సాగుతున్నాయి. మరికొన్ని గడ్డర్లు రావాల్సి ఉంది. రాబోయే ఏడాదిలో పనులన్నింటిని పూర్తిచేసి శంకర్ విలాస్ ను ప్రజలకు అందుబాటు లోకి తీసుకురాబోతున్నాం అన్నారు.

అవసరాన్ని బట్టి లేబర్ ని కూడా పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. గుంటూరు ప్రజల అదృష్టం బట్టి మన జిల్లాలో ఇన్ని ఆర్‌ఓబీలు నిర్మాణం చేయబోతున్నాం, చేసుకునే అవకాశం దక్కింది. అవకాశానికి మించి కాంపెన్సేషన్ కూడా ఇస్తున్నాము. కానీ శ్యామల నగర్ వద్ద నిర్మాణానికిగానూ కొందరు ఆర్‌ఓబి వద్దు ఆర్ యూ బి కావాలని అడుగుతున్నారు. దయచేసి అందరూ సహకరిస్తేనే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని మర్చిపోవద్దని మనవి చేశారు. శ్యామల నగర్ కు అందరూ ఒప్పుకుంటే అంగీకరిస్తే ల్యాండ్ అక్విజేషన్ కు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం అని వివరించారు. అనంతరం గల్లా మాధవి మాట్లాడుతూ ముందుగా చెప్పిన డెడ్లైన్ ప్రకారం శంకర్ విలాస్ పనులను పూర్తి చేస్తాం. మెటీరియల్ అంశాలు గాని, మరిన్ని ఏ అంశాలు అయినా సరే అన్నింటినీ పరిష్కరించి నిర్ణీత సమయం లోనే నిర్మాణం పూర్తి చేస్తాం. ఓవరాల్ గా వంతెన నిర్మాణ పనులు శరవేగంగా



సాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టు కోవద్దని ఎవరు ఏం చెప్పినా నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో లిప్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, ఆర్‌డబి ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కాగ్ ఆర్డినేషన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు అండగా కూటమి ప్రభుత్వం.







- త్రీ వీలర్ స్కూటీ ల ఉచిత పంపిణీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని.

**గుంటూరు, పెన్ సత్తా, జులై 16:** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1,750 మంది విభిన్న ప్రతిభావంతులకు త్రీ వీలర్ స్కూటీ వాహనాలను ఉచితంగా అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా లోని ఒక్కో నియోజకవర్గానికి 10 వాహనాలు చొప్పున ఏడు నియోజకవర్గాలకు గాను 70 మంది విభిన్న ప్రతిభావంతులకు గాను గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు పెంచడం, మరిన్ని సౌకర్యాలు పెంపొందించడం పై దృష్టి పెట్టింది.
అందులో భాగంగానే వారు తమ కాళ్ల పై వారు నిలబడేలాగా త్రీ వీలర్ మోటార్ల వాహనాలను అందజేస్తున్నామన్నారు.
ఒక్కో వాహనాన్ని రూ. 1.30 లక్షల విలువతో ఏడు నియోజకవర్గాల్లో రూ. 91 లక్షల విలువైన, రాష్ట్రం లోని 175 నియోజకవర్గాల్లోనూ 1,750 వాహనాలను రూ. 22.75 కోట్ల విలువైన వాహనాలను గురువారం అందజేస్తున్నామన్నారు. ఇవేగాక మరెన్నో సౌకర్యాలను ప్రభుత్వం తరపున విభిన్న ప్రతిభావంతులకు అందజేయడం జరుగుతుంది. వీటితో పాటు మేము సిఎస్ఆర్ నిధులతో ద్వారా 1,000 కి పైగా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు గాను వీల్ చైర్లు, త్రి వీలర్ వాహనాలు ఆటోమేటెడ్ బ్యాటరీ త్రి వీలర్ వాహనాలు, వీల్ చైర్లు పలు ఉపకరణాలను అందజేయడం జరిగింది అన్నారు. తరువాత నశీర్ అహ్మద్ మాట్లాడుతూ మా నియోజకవర్గంలో ఒక విభిన్న ప్రతిభావంతుడిని మొదటి నుంచి గమనిస్తున్నాను అతను కష్టపడి పనిచేసే వ్యక్తిత్వం అతనిదన్నారు. పాల ప్యాకెట్ల విక్రయిస్తూ ఎవరి పై ఆధారపడకుండా అతను సమాజంలో గౌరవ స్థానంలో జీవిస్తూ ఉంటాడన్నారు. అలాంటివారిని చూస్తే నిజంగా ఎంతో గర్వంగా ఉంటుందన్నారు. అలా కష్టపడి వారికి తోడ్పాటు అందించే విధంగా ప్రభుత్వం త్రి వీలర్ వాహనాలను అందజేయడం నిజంగా ఎంత చక్కటి కార్యక్రమం అన్నారు. అందులో భాగంగానే ఈరోజు గుంటూరు నియోజకవర్గం లోని 70 మందికి త్రీ వీలర్ వాహనాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు.
కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తర్వాత విభిన్న ప్రతిపవంతుల సమస్యలు వాటి పరిష్కారాల పై ప్రత్యేక దృష్టి పెట్టింది.
ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, పెంచిన పెన్షన్ల పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రతిభావంతులలో కేటగిరీల వారీగా నాయకులుగా ప్రతి రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కల్పించడం, పెట్టుకో నివాసాలలో వారికి ప్రత్యేక స్థానం కల్పించడం వంటి ఎన్నో సౌకర్యాలను కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. అన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న 370 బ్యాక్లాగ్ పోస్టులను విపైన ప్రతిభావంతులకు అందజేసిన చర్యలు తీసుకుంటున్నారన్నారు.
ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, కన్నా లక్ష్మీనారాయణ, మొహమ్మద్ నశీర్ అహ్మద్, జడ్పీ చైర్ పర్సన్ క్రిష్టియనా, రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, డిసిఎంఎస్ చైర్మన్ వద్రన హరిబాబు, జనసేన పార్టీ గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పరిటాల సునీత.







- ఆసుపత్రి పరి శుభ్రంగా, వైద్యులు అందుబాటులో ఉండాలన్న ఎమ్మెల్యే.
- పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన వైద్యులు, సిబ్బంది.
- శ్రేయోభిలాషుల కుటుంబానికి పరామర్శ, ప్రజల నుంచి వినతుల స్వీకరణ.

**రామగిరి, పెన్ సత్తా, జులై 16:** మండలం లోని పేరూరు ప్రాజెక్టు సమీపం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఉదయం ఆమె ఆసుపత్రికి వెళ్లగానే అక్కడున్న వైద్యులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న చికిత్సలను పరిశీలించారు. ఆసుపత్రితో పాటు పరిసరాల్ని పరిశీలించి, వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిని పరి శుభ్రంగా ఉంచు కోవాలని, వైద్యులు సమయానికి రావాలన్నారు. రోగులతో మర్యాద పూర్వకంగా ఉండాలని, పెద్ద సమస్య ఉంటే తప్ప ఇతర హాస్పిటల్స్ కు రెఫర్ చేయవద్దన్నారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో ఉన్న సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మసీ (మెడిసిన్స్) నిర్వహణ కోసం ప్రత్యేకంగా గది, వైద్యం కోసం వచ్చిన వారికి తగినన్ని బెడ్లు లేకపోవడం, నీటి సమస్యను ఎమ్మెల్యేకి వివరించగా వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన కుటుంబ శ్రేయోభిలాషి పెద్ద వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే సునీత ఆయన నివాసానికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగఢ సానుభూతి తెలిపారు. ఆ తర్వాత వెంకటాపురం లోని తన కార్యాలయానికి వివిధ కారణాలు సమస్యలు నిమిత్తం వచ్చిన వారితో సమావేశామయ్యారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు.

# నూకాంబికను దర్శించుకున్న సుందరపు





**రాంబిల్లి, పెన్ సత్తా,** మండలం లోని సీతపాలెం గ్రామంలో వెలసిన గ్రామ దేవత నూకాంబిక అమ్మవారిని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల కన్వీనర్ సుందరపు వెంకట సతీష్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకాంబిక ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనకాపల్లి అభివృద్ధి పనుల పై జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే రామకృష్ణ సమీక్ష



**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 16:** మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణం లోని రహదారులు, కాలువలు, ఓపెన్ జిమ్స్, పార్కులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన పనులు, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు, అలాగే చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి పనుల పై అధికారులతో సవివరంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ ఇంజనీర్ డీఈ పాల్గొన్నారు.

# మల్కాపురం గ్రామ సమస్యల పై స్థానిక ఎమ్మెల్యే కి వినతి పత్రం.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జులై 16:** మల్కాపురం గ్రామ కమిటీ సభ్యులు, పచ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు పి. జీ. వి. ఆర్. నాయుడు, (గణబాబు) ని కలవడం జరిగింది. గ్రామ కమిటీ సభ్యులు స్థానిక సమస్యలు పై ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేయగా ఆయన దాని పై సానుకూలంగా స్పందించారు.
ప్రధాన సమస్య మల్కాపురం గ్రామ సదనపట్టు స్థలములో రూఫ్ టాప్ నిర్మాణం పై కమిటీ సభ్యులు చర్చించగా ఆయాన ఈ సందర్భంగా మాట్లాడుతూ రూఫ్ టాప్ నిర్మాణం ఎత్తులో కట్టడం జరిగితే బాగుంటుంది, అందరికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఈ నిర్మాణం పనులు కోరమండల్ ఆర్థిక సహాయంతో పూర్తి చేయడం జరుగు తుందని అయన తెలియజేశారు. ( 2) అలాగే గ్రామ దేవత 23 -09- 2026 నుండి 01- 10- 2026 వరకు జరుగు ముత్యమాంబ అమ్మవారి మహోత్సవములకు కూడా సహాయ సహకారాలు అందించాలని గ్రామ కమిటీ వాళ్లు కోరగా ఈ విషయంలో ఆయన స్పందిస్తూ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.
అదే విధంగా మల్కాపురం గ్రామాన్ని తప్పుగా విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ భూమి గా సర్వే నంబర్ (1 ) గా రెవెన్యూ రికార్డులో చూపించినది అని తెలియజేయగా, ఈ విషయం పై ఆయన మాట్లాడుతూ నేను ఈ పని వెంటనే రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కారం జరిగే విధంగా చర్యలు చేపడతానని తెలియ జేయడం జరిగింది. ఈ విషయంలో మల్కాపురం గ్రామానికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని కూడా అయన హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బోగవిల్లి నాగభూషణ్, అధ్యక్షులు సత్యాల మహేష్, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబురావు, కోశాధికారి పట్నాల పెంటరావు, పట్నాల దేముడు, మజ్జి.రమేష్, ఉరుకూటి అప్పలరాజు, పెద్దాడ అప్పారావు, పెదగాడి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ గణేష్ ని కలిసిన కూటమి నాయకులు



**కూర్మన్నపాలెం, పెన్ సత్తా, జులై 16:** దువ్వాడ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నమ్మి గణేష్ ని పరవాడ మండలం జనసేన పార్టీ ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా, టిఎన్టియుసి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి సాలువా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు నమ్మి గణేష్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు సమర్ధవంత మైన సేవలు అందించి, శాంతి భద్రతల పరి రక్షణలో విశేషంగా కృషి చేయాలని కోరడమైనది.
ఈ కార్యక్రమంలో నకిరెడ్డి చిన్నా రావు (టిడిపి నాయుకులు)చీపురుపల్లి శ్రీనివాస్, మండల కూటమి నాయుకులు పాల్గొన్నారు.


## ప్రజా పంపిణీ వ్యవస్థలో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.



**అనకాపల్లి, జూలై 16 :** జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ), 2013 మార్గదర్శకాల ప్రకారం, ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ఇతర సంక్షేమ పథకాల పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పి.డి.ఎస్ (పిడిఎస్) సరఫరా, బియ్యం కార్డుల జారీ, ఐ.సి.డి.ఎస్ (ఐసీడీఎస్) ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న పోషకాహార కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం (మిడ్ – డే మీల్స్),
పౌరసరఫరాల సంస్థ ద్వారా జరుగుతున్న నిత్యావసర వస్తువుల పంపిణీ తీరును సమగ్రంగా కమిటీ సభ్యులతో కలిసి చర్చించారు. అదే విధంగా మార్కెటింగ్ శాఖ, విద్యాశాఖ, సంక్షేమ శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఆయిల్ ఇండస్ట్రీ, ఆహార భద్రత శాఖలకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాల పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ?ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందే రేషన్ బియ్యం, విద్యార్థులకు అందే మధ్యాహ్న భోజన బియ్యం నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ? ఆహార భద్రత చట్టం పరిధిలోకి వచ్చే అన్ని శాఖల (పీడీఎస్, మధ్యాహ్న భోజనం, ఐసీడీఎస్) పనితీరును శాఖల వారీగా సమీక్షించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కమిటీ సభ్యులు లేవనెత్తే ప్రజా సమస్యలు, ఫిర్యాదులను రికార్డు చేసి (మినిట్స్ అఫ్ ది మీటింగ్), వాటిని జిల్లా కలెక్టర్ ఆమోదంతో తదుపరి చర్యల కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ కి పంపించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న అధికారులందరూ తమ తమ విభాగాల నివేదికలను సమర్పించి, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్ మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ప్రస్తుతం మునుపెన్నడూ లేని విధంగా అత్యంత అద్భుతంగా పనిచేస్తోందని, ముఖ్యంగా రైతులకు సకాలంలో చెల్లింపులు జరపడంలో ప్రభుత్వం దేశం లోనే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పంట కొనుగోలు చేసిన 24 గంటల లోపలే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము క్రెడిట్ చేస్తోందన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని, జిల్లా స్థాయి కమిటీ సమావేశాల ద్వారా వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ, విద్యాశాఖ, పౌర సరఫరాల శాఖ, సంక్షేమ శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఆయిల్ ఇండస్ట్రీ, ఆహార భద్రత శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి, డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధి, ముగ్గురు కన్స్యూమర్ వాలంటీర్ ఆర్గనైజేషన్స్ (సీబీఓస్) ప్రతినిధులు, శారీరక వికలాంగుల విభాగం నుండి ఒకరు మెంబర్లు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి.





- ఓటరు జాబితా సవరణ పనుల్లో అలసత్వం వహించిన, గడువు దాటినా కఠిన చర్యలు తప్పవు.
- అధికారులకు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టమైన ఆదేశాలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 16:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత సమయాల్లోగా పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేయాలని ఈఆర్ఓ లను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ విసీ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓ లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియ పై కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు), సహాయ ఓటర్ల నమోదు అధికారులు (ఎఈఆర్ఓలు) ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత సమయాల్లోగా పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటరు గుర్తింపు కార్డుల ఫోటోల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, సమర్పించే ప్రతి అప్లికేషన్ లోనూ ఖచ్చితంగా ఫోటో ఉండేలా చూడాలని, దీనికి సంబంధించిన డేటాను ఏఈఆర్ఓ సమర్పించాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన (ఏఎస్డి) జాబితాలో డేటా వ్యత్యాసాలు జిల్లా వ్యాప్తంగా దాదాపు 21,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అంటే సగటున ఒక బీఎల్ఓకు 10 నుండి 15 దరఖాస్తులు మాత్రమే ఉండి ఉంటాయి కాబట్టి, వ్యత్యాసాలకు గల కారణాలను బీఎల్ఓలు పరిశీలించి, రెండు రోజుల్లోగా వాటిని సరిచేసి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఒకే రకమైన వివరాలతో ఉన్న ఓటర్ల (డెమోగ్రాఫికల్లీ సిమిలర్ ఎంట్రీస్)(డిఎస్ఈ) నమోదును సరిచేయడం చాలా సులువైన ప్రక్రియ. జిల్లా మొత్తం కలిపి కేవలం 1,500 ఎంట్రీలు మాత్రమే ఉన్నాయని, ఒక బీఎల్ఓకు సగటున ఒక్కటి కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఏ బీఎల్ఓ పరిధిలో ఈ ఎంట్రీలు ఉన్నాయో గుర్తించి, వెంటనే వాటిని సరిచేయాలని తెలిపారు. సదరు ఓటరు మన పరిధి లోనే ఉంటే ఉంచుకుని, వేరే చోట ఉంటే సంబంధిత బీఎల్ఓకు సమాచారం అందించి అక్కడ తొలగించేలా చర్యలు చేపట్టాలని, ఈ ప్రక్రియను ఈరోజే పూర్తి చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. బీఎల్ఓ లకు వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో అనకాపల్లి జిల్లా స్థిరంగా వెనుకబడి ఉండటం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 48 గంటలు దాటినా బీఎల్ఓలు తిరిగి కాల్ బ్యాక్ చేయని కేసులు దాదాపు 60 వరకు ఉన్నాయన్నారు .ఇక పై ప్రతిరోజూ దీని పై సమీక్ష ఉంటుందని, బీఎల్ఓ లాగిన్‌కు ఏ కాల్ వచ్చినా సరే, వారు తక్షణమే స్పందించేలా ఏఈఆర్ఓలు పర్యవేక్షించాలని సూచించారు.
ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని, ఫారాల నమోదులో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వారికి తగిన సహాయం అందించాలని స్పష్టం చేశారు. నేటి సాయంత్రానికి ఈ 60 పెండింగ్ కాల్స్ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
జిల్లాలో అనామలీస్ తగ్గించే ప్రక్రియలో కొన్ని నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయని, జూలై 20 వ తేదీ లోగా ఏఈఆర్ఓలు, బీఎల్ఓ ఇన్‌ఛార్జ్‌లు అందరూ సమన్వయం చేసుకుని జిల్లాలో ఈ వ్యత్యాసాలను పూర్తిగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అయితే, బీఎల్ఓ లాగిన్‌లో అనామలీ అని చూపిస్తే, దానికి ఖచ్చిత మైన, నిజమైన కారణం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా సవరణ అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అయినందున, అధికారులు, సిబ్బంది ఎటువంటి అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఈ ఆర్ వో లు, ఏ ఈ ఆర్ వో లు, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ వాసు నాయుడు, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

# ఘనంగా జగన్నాథ్ స్వామివారి రథయాత్ర







**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 16:** గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ్ స్వామి రథయాత్ర మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ఆలయ మంటపములో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు, సుభద్రా బలభద్ర జగన్నాథ్ స్వామి ని రథం పై అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ను పాలకమండ సభ్యులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ స్వామి కి ప్రత్యేక పూజలు చేసి తొలి రథయాత్ర ను ప్రారంభించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షులు దాడి రత్నాకర్ దంపతులు, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ రథయాత్ర గవరపాలెం ఆలయ వద్దనుండి బయలుదేరి పట్టణ పురవీధుల గుండా పయనించి గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజమ్మ హాలు వద్దకు చేరుకుంటుంది. డీఎస్పీ ఆధ్వర్యంలో సిఐలు ప్రేమ్ కుమార్, టీవీ అశోక్ కుమార్, వెంకటనారాయణ పోలీస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, కార్య నిర్వహణ అధికారి కె చంద్ర తేజ, ఆలయ కమిటీ ధర్మకర్తలు బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వర రావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోద్దేడ వెంకట చలపతి రావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కుటుంబానికి 5 లక్షల ప్రమాద భీమా చెక్కును అందజేసిన-పరిటాల శ్రీరామ్



**ధర్మవరం,జూలై 16 (పెన్ సత్తా)** పట్టణం సిద్దయ్యగుట్టకు చెందిన తెదేపా కార్యకర్త ఎర్రగుడి ధనుంజయ ప్రమాదవశాత్తు మరణించగా తెలుగుదేశంపార్టీ సభ్యత్వం ఉండటంతో 5లక్షల రూపాయల విలువ గల ఇన్సూరెన్స్ చెక్కును పరిటాల శ్రీరామ్ ధనుంజయ భార్య ఎర్రగుడి దుర్గమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 72 వేల మంది తెదేపా సభ్యత్వం నమోదు చేసుకున్నారని,పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యుడు ప్రమాదవశాత్తు మరణిస్తే తెలుగుదేశం పార్టీ ఐదు లక్షల రూపాయలు అందజేస్తుందని దేశంలో ఇంత పెద్ద మొత్తంలో అందజేసే పార్టీ ఏదీ లేదని నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో నారా లోకేష్ సారథ్యంలో ఆపదలో ఉన్న కార్యకర్తలకు ఆపద్బాంధవుడులా ఆర్థిక సాయం అందజేస్తున్నందుకు పరిటాల శ్రీరామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న ఎర్రగుడి దుర్గమ్మ మాట్లాడుతూ,నా భర్త మరణించిన పది హేను రోజుల్లోనే ఐదు లక్షల రూపాయలు చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి,పరిటాల శ్రీరామ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తల్లి పేరిట ఒక మొక్క కార్యక్రమం.

**(పెన్ సత్తా)** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా యలమంచిలి పట్టణంలోని శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) క్రీడా మైదానం గురువారం ఒక మంచి సంకల్పానికి వేదికైంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సామాజిక కార్యకర్త కూరగాయల బుజ్జి ఆధ్వర్యంలో 'తల్లి పేరిట ఒక మొక్క' అనే విశిష్ట కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో నిర్వహించారు. పచ్చదనాన్ని పెంపొందించడం, సమాజంలో పర్యావరణ స్పృహను చాటడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమ. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గ్లోబల్ వార్మింగ్ విపరీతంగా పెరిగిపోతోందని, దీనిని అరికట్టడానికి పచ్చదనం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఖాళీ స్థల ఆవరణలో కనీసం ఒక్క మొక్కనైనా నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. తల్లిపై ఉన్న గౌరవంతో నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందిస్తుందని, ప్రకృతిని కాపాడుకోవడం, రాబోయే తరాలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడం మనందరి ప్రాథమిక బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. కార్యక్రమ నిర్వాహకులు కూరగాయల బుజ్జి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే విస్తృతంగా అడవుల పెంపకం, సామాజిక వనరక్షణ జరగాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారిలో సామాజిక బాధ్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు డా. చిట్టిబాబు, డా.సుజాత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర అత్యంత కీలకమైనదని, ప్రతి విద్యార్థి పర్యావరణ సైనికుడిగా మారాలని కోరారు. ఈ ఆకుపచ్చని సంకల్పంలో భాగంగా కళాశాల క్రీడా ప్రాంగణంలో (ప్లే గ్రౌండ్) మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను దత్తత తీసుకుని, వాటి ఎదుగుదలను నిరంతరం పర్యావరణ కమిటీతో పాటు విద్యార్థులు పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ పచ్చదనం పండుగలో కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాసు, ఫిజిక్స్ విభాగ అధిపతి వెంకన్న, కెమిస్ట్రీ ఆచార్యులు, కళాశాల ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అత్యధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కళాశాల యాజమాన్యం, పర్యావరణ ప్రేమికులు ఈ సత్సంకల్పాన్ని అభినందించారు.



# నేత్రదానంతో రెండు కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపిన





నేత్ర దాత జింకా రామచంద్ర

**ధర్మవరం,జూలై 16 (పెన్ సత్తా)** పట్టణంలోని శారదానగర్ కి చెందిన కీ శే జింకా రామచంద్ర గుండెపోటు తో మరణించగా,తన కళ్ళను నేత్రదానం చేసి రెండు కుటుంబాల్లో కొత్త వెలుగును నింపారు. వివరాలకు వెళితే సమాచారాన్ని అందుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు నేత్రదానంపై వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు నేత్రధానం కి ఒప్పుకోవడం తో జిల్లా అందత్వ నివారణ సంస్థ,అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డివై కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ వారి టెక్నీషన్ జి రాఘవేంద్ర కంటి కార్నియా సేకరించడం జరిగింది . నేత్రదానానికి సహకరించిన దాత భార్య రమాదేవి కుమారుడు హేమంత్ కుమార్తెలు శ్రీలత, మణి కోడలు నాగమణి అల్లుడు సంతోష్,నాగరాజు కి సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షులు గాజుల సురేష్,ఉపాధ్యక్షులు టి చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ జూజారు రఘు,చిప్పల రెడ్డెప్ప,గుద్దిటి ధనుంజయ గుద్దిటి కేశవ విశ్వదీప సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయువారు
9392323605, లేదా9666629841
లేదా9059017583, లేదా8247724335
లేదా9492323912, లేదా9703126122
సంప్రదించాలన్నారు.

# తాళం వేసిన ఇంటికి పోలీసుల భరోసా

ఎల్ హెచ్ ఎం ఎస్ తో నిశ్చింత జీవితం

వన్ టౌన్ సిఐ రెడ్డప్ప

**ధర్మవరం,జూలై 16 (పెన్ సత్తా)** ప్రజల ఆస్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న ఎల్ హెచ్ ఎం ఎస్ కార్యక్రమం ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతోంది.జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దూరదృష్టితో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమాన్ని ధర్మవరం ఒకటవ పట్టణ పరిధిలో సీఐ రెడ్డప్ప తన సిబ్బందితో విజయవంతంగా అమలు చేస్తున్నారు.ఇంటికి తాళం వేసి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రోజులు బయటకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి,క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. దీంతో చోరీలు,ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించడంతో పాటు ప్రజల్లో భద్రతాభావం మరింత పెరుగుతోంది.సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌ను అందించాలనే ఎస్పీ సతీష్ కుమార్ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోంది.ఆ ఆశయాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ధర్మవరం ఒకటవ పట్టణ సీఐ రెడ్డప్ప తన విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకుంటున్నారు.



ప్రజల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని సిఐ రెడ్డప్ప తెలిపారు.
ప్రజలు కూడా తమ ఇళ్ల భద్రత కోసం ఈ సేవలను వినియోగించుకుని పోలీసులతో సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ అదనపు తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలి





ఎంఈఓ లు రాజేశ్వరి దేవి,గోపాల్ నాయక్

**ధర్మవరం, జూలై 16 (పెన్ సత్తా)** పట్టణము,గ్రామీణ ప్రాంతాలలో గల ప్రభుత్వ,మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు అదనపు తరగతులను నిర్వహించాలని ఎంఈఓ లు రాజేశ్వరి దేవి,గోపాల్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆంధ్ర ప్రదేశ్ ఆదేశాల మేరకు ఈ తరగతులు నిర్వహించాలని తెలిపారు.ఈ తరగతులు జూలై 13 వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు కేటాయించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం జరగాలని తెలిపారు. ఈ అదనపు తరగతులు నిర్వహించుటలో హెడ్మాస్టర్లు కీలకపాత్ర వహించాలి.ఎక్కడా ఎటువంటి ఫిర్యాదులు అందకుండా తల్లిదండ్రుల సహకారంతో విజయవంతం అయ్యేలా చూడాలని తెలిపారు.2026-27 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పిల్లలు ప్రతి పాఠశాలలో నూరు శాతం ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులలో మూడు గ్రూపులుగా విడదీసి,ఉత్తమ విద్యను అందించేలా కృషి చేయాలని తెలిపారు.డల్లర్స్ విద్యార్థుల విషయంలో మరింత కృషి చేయాలని వారు గుర్తు చేశారు.కావున హెడ్మాస్టర్లు ఈ అదనపు తరగతుల విషయంపై పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ గానీ, డీఈఓ గానీ,ఇతర అధికారులు గానీ ఆకస్మిక తనిఖీలు ఉంటాయని తెలిపారు.కావున తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రోత్సహించే విధంగా సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

# (క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ )లో భాగంగా 'అభయ' అవగాహన కార్యక్రమం....



చోడవరం పోలీస్ స్టేషన్ సిఐ పి.అప్పలరాజు...

**జూలై (పెన్ సత్తా)** స్థానిక శ్రీ విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో గురువారం నాడు మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ (క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ ) లో భాగంగా 'అభయ'పట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్టేషన్స్ సీఐ పీ అప్పలరాజు పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ అప్పలరాజు మాట్లాడుతూ మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహిళలపై జరిగే వేధింపులు, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. (ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రమ్ డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ ) ఫోక్సో చట్టం మరియు మహిళల రక్షణకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ -112, శక్తి యాప్, అభయ వంటి పోలీస్ సలహా సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ర్యాగింగ్, మాదకద్రవ్యాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం అనకాపల్లి జిల్లాలో 470 మార్కులు గాను 467 మార్కులు సాధించిన సి హెచ్. జయ శ్రీ, 466 మార్కులు సాధించిన పి. ఉషారాణి విద్యార్థులను సిఐ అప్పలరాజు మరియు కళాశాల సిబ్బంది సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఈ.గోవిందరావు, డైరెక్టర్లు బివి రామకృష్ణ, బిజీ దామోదర్, వై శ్రీను, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు...

# నియోజకవర్గంలో సర్ జరిగిన తీరుపై నాయకులతో అడిగి తెలుసుకున్న..శ్రీరామ్

- నియోజకవర్గ తెదేపా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన పరిటాల శ్రీరామ్
- నొలింక్-అనామిలిస్ లో అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూసే బాధ్యత తెదేపా నాయకులదే
- ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి 5 లక్షల చెక్కును అందజేసిన శ్రీరామ్



**ధర్మవరం జూలై 16 (పెన్ సత్తా)** గత 30 రోజులుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్న తెదేపా కుటుంబ సభ్యులందరికీ పరిటాల శ్రీరామ్ అభినందనలు తెలియజేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై స్థానిక ఎర్రగుంట సర్కిల్ లోగల తెదేపా కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని 19,730 ఓటర్ల యొక్క వివరాలు మరియు ఓటరు పేరు, బంధువుల పేర్లలో అచ్చులు,హల్లుల లో దొర్లిన పొరపాటు జరిగిన అనామిలిస్ ఓటర్లు 56,000 వేల మందికి సంబంధించిన అవసరమైన సర్టిఫికెట్లను సైతం ప్రతి ఒక్కరూ గుర్తించి బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని పరిటాల శ్రీరామ్ తెలుగుదేశం పార్టీ నాయకులకు సూచించారు.ఈనెల 30వ తేదీ వరకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలని పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా రాష్ట్ర పార్టీ నిర్వహిస్తున్న డోర్ టు డోర్ కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుందని,ఈ కార్యక్రమాన్ని కూడా నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విజయవంతంగా కొనసాగించాలని పరిటాల శ్రీరామ్ పార్టీ నాయకులకు సూచించారు.

# చక్కటి కంటి చూపు అనేది వెలుగునిస్తుంది

ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప



**ధర్మవరం,జూలై 16 జూలై (పెన్ సత్తా)** చక్కటి కంటిచూపు అనేది అందరికీ వెలుగునిస్తుందని ఆప్తారామిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తెలిపారు.ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని గొట్లూరు జడ్పీ హెచ్ఎస్ పాఠశాల యందు 131 మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం వారికి వైద్య చికిత్సలు అందించగా కేవలం నలుగురికి మాత్రమే కంటి అద్దాలు అవసరం ఉన్నదని వారు తెలియజేశారు. తదుపరి కంటి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.త్వరలో ప్రభుత్వం ద్వారా అద్దాలను పంపిణీ చేస్తామని తెలిపారు. తదుపరి కంటి సంరక్షణ గూర్చి వాటి ఆవశ్యకత గూర్చి విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, మలేరియా అసిస్టెంట్ ఆంజనేయులు, ఏఎన్ఎం నీరజ, హెడ్మాస్టర్ జగన్నాథం, ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మానవతను చాటుకున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు



**ధర్మవరం,జూలై 16 (పెన్ సత్తా )**పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మరోసారి తమ మానవతను చాటుకున్నారు. వివరాలకు వెళితే కాయగూరల మార్కెట్ వద్ద గల చర్చి వద్ద ఒక ఆవు దూడ కాలిగిట్టకు తీవ్రమైన గాయమై లేవలేని పరిస్థితిలో ఉంది.ఈ సమాచారాన్ని తెలుసుకున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రమోటర్ గ్రూప్ మెంబర్ పళ్లెం జనార్ధన,కోశాధికారి చల్లా చంద్రశేఖర్ అక్కడికి చేరుకొని, ప్రాథమికంగా గాయాన్ని శుభ్రం చేసిన తర్వాత ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి ఆటో ద్వారా తీసుకెళ్లి అక్కడ వైద్యుని ద్వారా వైద్య చికిత్సలను అందించారు.తిరిగి తన అమ్మ గోమాత వద్దకు ఆ దూడను చేర్చారు.కానీ ఆ గోమాత (ఆవు) సహాయం చేసిన వారి ఇరువురిని ఎంతో ఆప్యాయంగా దగ్గరికి వెళ్లిన వైనం అందరినీ ఆకట్టుకుంది.దీంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మరోసారి తన మానవతాలు చాటు కొనడంతో ప్రజలు పలువురు సంస్థలు అభినందించారు.

# సముద్ర గర్భంలో 392 మీటర్ల లోతున రహదారి

ఇంజనీరింగ్ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ నార్వే ప్రభుత్వం ఒక భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన, అత్యంత లోతైన సముద్రగర్భ రహదారి టన్నెల్ నిర్మాణంతో చరిత్ర సృష్టించబోతోంది. 'రోగ్‌ఫాస్ట్' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, 27 కిలోమీటర్ల పొడవుతో సముద్ర మట్టానికి సుమారు 392 మీటర్ల (దాదాపు 1286 అడుగులు) లోతున ప్రయాణించే అద్భుతమైన రహదారి అందుబాటులోకి వస్తుంది. నార్వే పశ్చిమ తీరంలోని బోక్నాఫ్జోర్డ్ సముద్ర జలాల కింద ఈ రెండు వరుసల సొరంగాన్ని నిర్మిస్తున్నారు.



### ప్రయాణ కష్టాలకు చెక్

నార్వే పశ్చిమ తీర ప్రాంతం మత్స్య, చమురు, గ్యాస్, వాణిజ్య కార్యకలాపాలకు ఎంతో కీలకం. అయితే, ఈ ప్రాంతంలోని ప్రధాన నగరాలైన స్టావాంగర్, బెర్గెన్ మధ్య ప్రయాణం ప్రస్తుతం ఫెర్రీలు, చిన్నచిన్న టన్నెళ్లపై ఆధారపడి సాగుతోంది. దీనివల్ల ప్రయాణ సమయం దాదాపు ఐదు గంటల వరకు పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 'ఇ39 కోస్టల్ హైవే' ప్రాజెక్టులో భాగంగా ఫెర్రీ రహిత మార్గాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా చేపట్టిన రోగ్‌ఫాస్ట్ టన్నెల్ పూర్తయితే, కీలక మార్గాల్లో ప్రయాణ సమయం సుమారు 40 నిమిషాల వరకు తగ్గనుంది. అన్ని కాలాల్లోనూ రవాణాకు ఎలాంటి అంతరాయం ఉండదు.

### నిర్మాణంలో ఎదురవుతున్న తీవ్ర సవాళ్లు

ఈ టన్నెల్ నిర్మాణం అత్యంత క్లిష్టమైన సవాళ్లతో కూడుకున్నది. కొన్ని దేశాల్లో మాదిరిగా ముందుగా తయారుచేసిన కాంక్రీట్ భాగాలను అమర్చకుండా, నేరుగా సముద్ర గర్భంలోని దృఢమైన రాతి పొరలను తొలిచి ఈ మార్గాన్ని నిర్మిస్తున్నారు. పనులను వేగవంతం చేసేందుకు ఉత్తరం, దక్షిణం, మధ్య భాగాల నుంచి ఏకకాలంలో నిర్మాణం సాగిస్తున్నారు. అయితే, సముద్ర మట్టానికి దాదాపు 300 మీటర్ల లోతులో పనులు సాగుతున్నప్పుడు, బలహీనమైన, పగుళ్లు ఉన్న రాతి పొరల నుంచి పెద్ద ఎత్తున సముద్రపు నీరు లీక్ అవుతోంది. లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ భౌగోళిక నిర్మాణాల వల్ల పనులు నెమ్మదిస్తున్నాయి. ఇంజనీర్లు ప్రత్యేకమైన గ్రౌటింగ్, సీలింగ్ టెక్నాలజీలను ఉపయోగించి నీటి లీకులను అరికట్టి, చుట్టుపక్కల రాతి పొరలను స్థిరీకరిస్తున్నారు. నార్వేజియన్ పబ్లిక్ రోడ్స్ అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్ట్ మేనేజర్లు ఈ సమస్యలను ధృవీకరించారు. భద్రతా ప్రమాణాల ప్రకారం, టన్నెల్ పైభాగంలో కనీసం 50 మీటర్ల మందంతో దృఢమైన రాతి పొర ఉండాలి.

### భవిష్యత్ ప్రయోగాలకు మార్గదర్శి

ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత ఉంది. సముద్ర మట్టానికి 260 మీటర్ల లోతులో ఒక భూగర్భ జంక్షన్, రౌండ్‌అబౌట్‌లను నిర్మిస్తున్నారు. ఇది సమీపంలోని క్విట్సోయ్ ద్వీపానికి కనెక్టివిటీని అందిస్తుంది. ఖర్చుల పెరుగుదల కారణంగా 2019లో తాత్కాలికంగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్, 2021లో పునఃప్రారంభమైంది. దీని అంచనా వ్యయం దాదాపు 2.3 బిలియన్ యూరోలు. ప్రభుత్వ నిధులు, టోల్ రుసుములతో ఈ ప్రాజెక్టును పూర్తిచేయనున్నారు. 2033 నాటికి ఈ టన్నెల్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు విజయం, భవిష్యత్తులో నార్వే చేపట్టబోయే తేలియాడే టన్నెల్స్ వంటి మరిన్ని క్లిష్టమైన ప్రాజెక్టులకు మార్గదర్శకంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం

త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వ్యవస్థాగత క్షీణత వంటి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ పేర్కొంది. డీలిమిటేషన్, తీవ్రమైన నేరాల్లో అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్న ప్రధానులు, సీఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. దిల్లీలో ఉన్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) అధ్యక్షురాలు సోనియా గాంధీ నివాసంలో హస్తం పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, చిదంబరం, నసీర్ హుస్సేన్, మాణికం ఠాగూర్, తారిఖ్ అన్వర్, శశి థరూర్, మనీశ్ తివారీ తదితరులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.



### ఆ అంశాలపై మోదీ సర్కార్‌ను నిలదీస్తాం : ఖర్గే

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దేశంలో పేపర్ లీక్‌లు, ధరల పెరుగుదల, విదేశాంగ విధానం, అవినీతి ఆరోపణలు, అట్టడుగు వర్గాల హక్కులతో సహా పలు అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. పౌరుల జీవితాలు, ఆశయాలపై ప్రభావం చూపే అత్యవసర అంశాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. సీపీపీ సమావేశం అనంతరం ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

"అయోధ్య విరాళాల చోరీ, పేపర్ లీక్‌లు, విద్యా వ్యవస్థ క్షీణత, వ్యవస్థలను తమ గుప్పిట్లోకి తీసుకోవడం, రాజకీయ పార్టీలను చీల్చడం, కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, ప్రజల నడ్డి విరిచే ధరల పెరుగుదల, విదేశాంగ విధాన వైఫల్యాలు, మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదాలు, 3.5 కోట్ల వాహన యజమానులపై ఇథనాల్ మిశ్రమ విధానాన్ని రుద్దడం, అదుపులేని అటవీ నిర్మూలన, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీల హక్కులపై నిరంతర దాడులు వంటి కీలక అంశాలపై రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తుంది. " అని ఖర్గే పేర్కొన్నారు.

### అఖిలపక్షం ఏర్పాటు చేయాలని మోదీకి ఖర్గే లెటర్

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరిగి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు దాని నిశిత పరిశీలనకు తమకు తగిన సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. డీలిమిటేషన్ బిల్లు సవరించిన ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు తాను లేఖలు రాశానని ఖర్గే పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు ఆ అభ్యర్థనలను ఆయన పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ ప్రభుత్వానికి లోక్‌సభలో లభించలేదని పేర్కొన్నారు.

### కేంద్ర సర్కార్ ప్రవేశపెట్టబోయే బిల్లులపై సవిరంగా చర్చించాం : జైరాం రమేశ్

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెడితే తమ పార్టీ దానిని గట్టిగా వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర సర్కార్ ప్రవేశపెట్టే అవకాశం ఉన్న బిల్లులు,'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదిక వంటి అంశాలపై సీపీసీ సమావేశంలో సవివరంగా చర్చలు జరిపిందని తెలిపారు. ప్రభుత్వ అధికారిక శాసనపరమైన అజెండా తమ పార్టీకి ఇంకా అందలేదని, జులై 19న జరగనున్న అఖిలపక్ష సమావేశంలో వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ అనంతరం జైరాం రమేశ్ ఈ మేరకు విలేకరులతో వ్యాఖ్యానించారు. "ఏప్రిల్ 17న మోదీ ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజారిటీ లేక పార్లమెంట్‌లో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా మళ్లీ తిరిగి సభలో తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మేము విన్నాము. డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి ఎల్లప్పుడూ స్పష్టంగా, స్థిరంగా ఉంది. మేము డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తాం. వ్యతిరేకిస్తూనే ఉంటాం. ప్రతిపక్ష పార్టీలన్నింటిలో ఐక్యత కోసం అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ప్రతిపక్ష పార్టీలను చీల్చడం ద్వారా ఈ బిల్లును ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సంపాదించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్ 16, 17 తేదీలలో డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన అన్ని పార్టీలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, విపక్ష నేత రాహుల్ గాంధీ సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న తీవ్రమైన నేరాల్లో అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్న ప్రధానులు, సీఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రతా చట్టం -2013 సవరణ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుంది."

### అమిత్ షా పార్టీలను చీల్చారు : జైరాం రమేశ్

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, అయితే దానిని ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తుందని జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని తాము అనేక సార్లు డిమాండ్ చేశామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అలా చేయడానికి సిద్ధంగా ఉంటే తాము ఆ బిల్లుకు మద్దతు ఇస్తామని ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలు పార్టీలను చీల్చారని ఆరోపించారు. కుతంత్రాల ద్వారా లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీని సాధించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించారు. ఒకవేళ అలా మెజారిటీ సాధించినా అది ప్రజాస్వామ్యానికే మచ్చగా మిగిలిపోతుందని అన్నారు. అయితే లోక్‌సభలో బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ లభించే అవకాశం లేదని స్పష్టం చేశారు.

## 'ప్రతి పౌరుడి ప్రాణం అమూల్యమైనది'

### వాంగ్‌చుక్ ఆరోగ్యంపై రోజువారీ పర్యవేక్షణకు హైకోర్టు ఆదేశం

గత కొన్ని రోజులుగా జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యం, భద్రతను ప్రభుత్వమే చూసుకోవాలని దిల్లీ హైకోర్టు సూచించింది. ఈ మేరకు కేంద్ర, దిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. అవసరమైతే వెంటనే వైద్య చికిత్స అందించాలని స్పష్టం చేసింది. సోనమ్ నిరాహార దీక్షను విరమించకపోతే, 48 గంటల్లో ఆయన బతకకపోవచ్చని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ప్రతి పౌరుడి ప్రాణం ఎంతో విలువైనదని, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రం, దిల్లీ ప్రభుత్వం తరఫున వర్చువల్‌గా హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ఇప్పటికే రోజూ పరీక్షిస్తున్నామని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ వైద్యులు, వైద్య నిపుణులు ఆయన ఆరోగ్య సూచికలను నిరంతరం పరిశీలిస్తున్నారని వివరించారు. దీనిపై ధర్మాసనం, ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఉందా అని ప్రశ్నించగా, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మెహతా స్పష్టం చేశారు. అవసరమైతే మరో వైద్య బృందాన్ని కూడా పంపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నమోదు చేసిన హైకోర్టు, ప్రభుత్వ వైద్యులు, నిపుణులు రోజూ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పరీక్షించాలని ఆదేశించింది. వారి సూచనల మేరకు అవసరమయ్యే వైద్య చికిత్సను వెంటనే అందించాలని స్పష్టం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాకేశ్ కుమార్ సాహ్నీ పిల్‌ను దాఖలు చేశారు. ఆయన మరో 48 గంటలు నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే చనిపోయే ప్రమాదం ఉందని పిటిషన్?లో పేర్కొన్నారు. వెంటనే వైద్య సహాయం అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు కేంద్రం, దిల్లీ ప్రభుత్వం తరఫున స్పష్టమైన హామీ రావడంతో ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ముగించింది. ఇదిలా ఉండగా, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు తాజా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. గత 19 రోజులుగా ఉపవాసం కొనసాగిస్తున్న ఆయన బరువు 9 కిలోలకు పైగా తగ్గినట్లు సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సతీశ్ లాంబా వెల్లడించారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయి డెసీలీటర్‌కు 80 మిల్లీగ్రాములుగా నమోదైందని చెప్పారు.

## 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై ఇది అదనపు భారాన్ని మోపుతుందని, వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన మౌఖిక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడం సరికాదు. ఆ వయసులో విద్యార్థులు ఇప్పటికే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అటువంటి సమయంలో కొత్త భాషను ఎందుకు పరిచయం చేస్తారు? అవసరమైతే ఆరో తరగతి నుంచే దీని అమలు చేయండి" అని జస్టిస్ నాగరత్న కేంద్రానికి సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షల తాలూకు ఒత్తిడి ఎనిమిదో తరగతి నుంచే మొదలవుతుందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న సీబీఎస్ఈ నూతన నిబంధనల ప్రకారం, 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండటం తప్పనిసరి. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, దీని అమలుపై స్టే ఇచ్చేందుకు మాత్రం అప్పట్లో నిరాకరించింది. తమిళనాడులో ద్విభాషా విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో, నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. త్రిభాషా సూత్రంలో హిందీ తప్పనిసరి కాదని, సంస్కృతం లేదా ఇతర ప్రాంతీయ భాషలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని పేర్కొంది. నవోదయ విద్యాలయాలకు భూ కేటాయింపులపై తగిన నిర్ణయం తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఆగస్టు 11 వరకు సమయం ఇచ్చింది. ప్రస్తుత విచారణలో కోర్టు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ధర్మాసనం చేసిన మౌఖిక వ్యాఖ్యలు విద్యా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## 'హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదు'



అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రమైన వేళ హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల విషయంలో భారత ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీచేసింది. హర్మూజ్ గుండా రాకపోకలు సాగించే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదని సముద్రయాన నియంత్రణ సంస్థ(డీజీఎంఏ) స్పష్టంచేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఈ ఆదేశాలను అమలు చేయాలని నౌకల యజమానులు, నిర్వాహకులు, రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ సంస్థలకు నిర్దేశించింది. గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు దిగజారుతున్న వేళ భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ వివరించింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధితో పాటు పరిసర ప్రాంత జలాల్లో నిఘాను పెంచాలనీ నావిగేషనల్ హెచ్చరికలు, భద్రతాసలహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఐఎస్?పీఎస్? కోడ్‌ను కఠినంగా అమలు చేయాలని సూచించింది. నౌకాయానానికి సంబంధించిన అంతర్జాతీయ నియామవళిని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన వివరాలను షేర్? చేసింది. గల్ఫ్? ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని తెలిపింది.

### ఆ నౌకలు నేవిగేషన్ హెచ్చరికలను పట్టించుకోలేదా?

కాగా అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఘర్షణలతో కూడిన హర్మూజ్ జలసంధిలో అనేక వాణిజ్య నౌకలు దాడులకు గురవుతున్నాయి. తాజాగా యూఏఈ నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ఇద్దరు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆ రెండు నౌకలు నేవిగేషన్? హెచ్చరికలను విస్మరించినట్లు సమాచారం. అలాగే, ఇటీవల ఒమన్? తీరంలో జీఎఫ్?ఎస్? గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్? దాడి చేసింది. ఆ దాడిలో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు. తాజాగా అతడు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన అనంతరం అతడిని కాపాడేందుకు చర్యలు చేపట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మరోవైపు, భారతీయులు మృతి చెందడం పట్ల భారత్? తీవ్రంగా స్పందించింది. దాడులను ఖండిస్తూ, ఇరాన్? ఉప దౌత్యవేత్తకు సమన్లు జారీచేసింది. అలాగే, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పేర్కొంది.

### వైద్య సహాయం అందక భారత నావికుడు మృతి

కొద్దిరోజుల క్రితం కూడా ఒమన్ తీరంలో వైద్యం అందక భారత నావికుడు మృతి చెందాడు. ఒమన్ తీరంలోని 'ఎంటీ సెలెస్టియల్' నౌకలో సెకండ్ ఆఫీసర్ నిశాంత్ అనారోగ్యానికి గురయ్యాడు. అయితే, ఇరాన్ దాడులు చేస్తుండటంతో సకాలంలో అతడికి వైద్య సాయం అందలేదు. ఈ నేపథ్యంలో నిశాంత్ మరణించినట్లు ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా పేర్కొంది. మృతదేహానికి సరైన సంరక్షణ లేకుండా నౌకలోనే ఉన్నట్లు తెలిపింది. కాగా, మృతుడు తమిళనాడుకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఇక, పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్ నౌకాశ్రయాలపై మళ్లీ దిగ్బంధనం విధించింది అమెరికా. అలాగే, అమెరికా దాడుల్లో ఏడుగురు సైనికులు మృతిచెందారని, 260 మందికిపైగా గాయపడ్డారని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్? తీవ్రంగా స్పందించింది. ఇటీవల అమెరికా, ఇరాన్? మధ్య కుదిరిన శాంతి ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు ఇరాన్? ఇప్పటికే ప్రకటించింది. నౌకాదళ దిగ్బంధనం విధించి అమెరికా ఒప్పందాన్ని పూర్తిగా ముక్కలు చేసిందని ఇరాన్ ఆరోపించింది. అలాగే, ఇకపై ఆ దేశంతో చర్చలు జరిపే అవకాశమే లేదని తేల్చి చెప్పింది. మరోవైపు, టెహ్రాన్?? చర్చలకు ముందుకు రాకుండే ఆ దేశంపై దాడులను తీవ్ర తరం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్? హెచ్చరించారు. వచ్చే వారం నుంచి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుందని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జలసంధి జగడం!

ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాల్లో యుద్ధాలు, విప్లవాల సరసన సముద్ర జలసంధులదీ ప్రత్యేక అధ్యాయమే! ఖండాలను విడదీస్తూ, మహాసముద్రాలను కలుపుతూ ఇరుకుగా సాగే 'చోక్ పాయింట్లు' ప్రపంచ వాణిజ్యానికి ప్రాణనాడులు. వాటి గొంతు నొక్కితే ఖండాంతర ఆర్థిక వ్యవస్థలే ఉక్కిరిబిక్కిరవుతాయి. 1956నాటి సూయిజ్ సంక్షోభం సృష్టించిన భౌగోళిక రాజకీయ సునామీ తర్వాత.. ఏడు దశాబ్దాలకు మళ్లీ అలాంటి పరిణామాలే పునరావృతమవుతున్నాయి. అమెరికా-ఇరాన్ పరస్పర దిగ్బంధనాలతో హర్మూజ్ జలసంధి మూసుకుపోవడం, కాల్పుల విరమణ పేకమేడలా పెళుసుగా మారడం, రాకపోకల హక్కులపై ప్రతిష్టంభన కొనసాగడం.. అంతర్జాతీయ సముద్ర వాణిజ్యం ఎంత బలహీన పునాదులపై నిలబడి ఉందో బట్టబయలు చేశాయి. ఒకప్పుడు స్వేచ్ఛా రాకపోకలకు నెలవైన హర్మూజ్‌ను ఇరాన్ ఒత్తిడి అస్త్రంగా మార్చుకుని సుంకాలు విధించే స్థాయికి చేరడం ప్రపంచ దేశాలకు కొత్త పాఠం! ఈ నేపథ్యంలో ప్రపంచం దృష్టి మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైంది. హర్మూజ్ మూతపడక ముందు అక్కడి నుంచి రోజుకు 134 నౌకలు రాకపోకలు సాగిస్తే.. జూలై 14న ఒక్కరోజే మలక్కా మీదుగా 281 నౌకలు ప్రయాణించాయని షిప్ ట్రాకర్ గణాంకాలు చెబుతున్నాయి. మలేసియా, సింగపూర్, ఇండోనేసియాల మధ్య 900 కి.మీ. పొడవు, 65 కి.మీ. వెడల్పుతో విస్తరించిన ఈ జలసంధి.. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో 24 శాతాన్ని, చమురు రవాణాలో ఏకంగా 45 శాతాన్ని, కార్గో షిప్‌మెంట్లలో 23 శాతాన్ని మోస్తోంది. మలేసియా, ఇండోనేసియా, థాయిలాండ్, సింగపూర్ ఈ జలసంధికి 'సంరక్షక' పాత్ర పోషిస్తుండగా.. చైనా, అమెరికా, భారత్, జపాన్‌లతోపాటు యావత్ ఆసియాన్‌కు మలక్కా నిరాటంకంగా ఉండటం జీవన్మరణ సమస్య. కానీ గల్ఫ్ యుద్ధ పర్యవసానాలతో దక్షిణ చైనా సముద్రం, తైవాన్ జలసంధుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దక్షిణ చైనా సముద్రం మొత్తంపై చైనా దావా 2016నాటి 'అంక్లోస్' తీర్పుకు విరుద్ధమని పశ్చిమ దేశాలు మరోసారి తేల్చినా బీజింగ్ ఖాతరు చేయడం లేదు. 2003 నుంచి ఆసియాన్ కోరుతున్న ప్రవర్తనా నియమావళిని నాన్చుతూ వచ్చిన డ్రాగన్‌ను.. ఆసియాన్ అధ్యక్ష హోదాలో ఉన్న ఫిలిప్పీన్స్ ఎట్టకేలకు 2026 గడువుకు కట్టడి చేయగలిగింది.

ఈ సమీకరణాల్లో చైనా వ్యూహాత్మక ఆత్రుతను అర్థం చేసుకోవాలంటే 'మలక్కా డైలమా' వద్దకు వెళ్లాలి. 2003లో నాటి అధ్యక్షుడు హు జింటావో తొలిసారి ప్రస్తావించిన ఈ సందిగ్ధత రెండు దశాబ్దాల తర్వాత మరింత తీవ్రరూపం దాల్చింది. చైనా దిగుమతి చేసుకునే ముడి చమురులో 80 శాతం, గ్యాస్‌లో 70 శాతం, 1.5 లక్షల కోట్ల డాలర్ల ఎగుమతులు ఈ ఒక్క జలసంధి మీదుగానే సాగుతున్నాయి. అదే మూసుకుపోతే డ్రాగన్ ఆర్థిక వ్యవస్థకు విపత్తే. సుండా, లాంబోక్ జలసంధుల చుట్టుదారులను భౌగోళిక సమస్యలు, వ్యయ-కాలహరణ భారాలు వెనక్కి నెట్టాయి. జిన్‌జియాంగ్‌ను గ్వాదర్‌తో కలిపే 6,200 కోట్ల డాలర్ల చైనా-పాకిస్థాన్ కారిడార్, క్యాక్‌ఫ్యూ నుంచి యునాన్ దాకా చైనా-మయన్మార్ కారిడార్ నిర్మించినా.. మయన్మార్ అంతర్యుద్ధంతో అవి నిరుపయోగంగా మారాయి. మరోవైపు హోర్ముజ్‌ను తెరిచి ఉంచడంలో చేదు అనుభవం చవిచూసిన అమెరికా.. మలక్కా విషయంలో ఎలాంటి అవకాశం ఇవ్వదలచుకోలేదు. ఏప్రిల్ 14న కీలక కాపలాదారు ఇండోనేసియాతో భారీ రక్షణ సహకార భాగస్వామ్యాన్ని ప్రకటించింది. 'ఇండో-పసిఫిక్ కమాండ్' నుంచి 'ఇండో'ను తొలగించి పాత 'పసిఫిక్ కమాండ్' పేరుకు మళ్లుతూ వ్యూహాత్మక సంకేతాలిచ్చింది. సింగపూర్ సమీపంలో కేవలం 2.8 కి.మీ. వెడల్పుండే ఫిలిప్స్ ఛానల్ ఈ జలసంధిలో అత్యంత బలహీన బిందువు. దాని పరిరక్షణ ప్రణాళికలకు తోడు 'అగ్రరాజ్యాల చొరబాటు నుంచి మలక్కా, దక్షిణ చైనా సముద్ర పరిరక్షణ ఆసియాన్ కేంద్రం' మే నెలలో ఏర్పాటైంది. ఇక హోర్ముజ్ మూసివేతతో మలేసియా మినహా ఆసియాన్ దేశాలన్నీ దెబ్బతిన్న నేపథ్యంలో.. అండమాన్ సముద్రంలోని రనోంగ్, థాయిలాండ్ గల్ఫ్‌లోని చుంఫోన్ నౌకాశ్రయాలను కలిపే 3,600 కోట్ల డాలర్ల భూ కారిడార్ పునరుద్ధరణను థాయ్ ప్రధాని అనుతిన్ ప్రకటించారు. లాజిస్టిక్స్ వ్యయాలను 30 శాతం తగ్గించి, రవాణా సమయాన్ని 14 రోజులు ఆదా చేసే ఈ కారిడార్‌లో పెట్టుబడిదారైన చైనాయే ప్రధాన లబ్ధిదారు కానుండగా.. సింగపూర్ తన కీలక స్థానాన్ని కోల్పోయే ప్రమాదముంది.

ఈ మహా సముద్ర చదరంగంలో భారత్ స్థానం విస్మరించలేనిది. మలక్కా పశ్చిమ ముఖద్వారాన్ని కప్పి ఉంచే 'సిక్స్ డిగ్రీ ఛానల్'కు కేవలం 40 నాటికల్ మైళ్ల దూరంలో భారత భూభాగం ఉంది. అండమాన్-నికోబార్‌లో 500 కోట్ల డాలర్లతో చేపట్టిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు వివాదాస్పదమే అయినా.. గలాతియా బే వద్ద నిర్మించే లోతైన నౌకాశ్రయం మలక్కా ప్రవేశద్వారం వద్ద అంతర్జాతీయ ట్రాన్స్‌షిప్‌మెంట్ కూడలిగా అవతరించనుంది. జూలై 4న అండమాన్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డీకే జోషి దీని వ్యూహాత్మక విలువను సమీక్షించడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యానికి నిదర్శనం. సమీపంలోని ఐఎన్ఎస్ బాజ్ స్థావరం రన్‌వే ఇప్పటికీ భారీ జెట్‌లకు అనువుగా లేకపోవడం లోటే. 1989లో ఈ స్థావర విస్తరణపై అభ్యంతరం తెలిపిన ఇండోనేసియాతో కాలచక్రం తిరిగింది. ప్రధాని మోదీ ఇటీవలి పర్యటన అపనమ్మకాల శకానికి తెరదించగా.. ఈ వారమే కుదిరిన చరిత్రాత్మక బ్రహ్మోస్ ఒప్పందం రక్షణ బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా దూకుడుకు ముకుతాడు వేయాలంటే.. హిమాలయాల్లో కాదు, మలక్కా జలాల్లో ఒత్తిడి పెంచాలన్న ఆలోచనలు వ్యూహకర్తల్లో బలంగా వినిపిస్తున్నాయి. చైనా 'మలక్కా డైలమా'ను భారత్ సానుకూలతగా మలుచుకోగలిగితే బేరసారాల శక్తి ఇబ్బడిముబ్బడవుతుందన్నది వారి తర్కం. అయితే చోక్ పాయింట్ల రాజకీయం రెండువైపులా పదునున్న కత్తి వంటిదన్న స్పృహ అవసరం. జలసంధులను ఆయుధాలుగా మార్చే ధోరణి మొదలైతే అది ఏ దేశాన్నీ వదలదన్నదే హోర్ముజ్ పాఠం. అందుకే మలక్కాను ఘర్షణ వేదిక కానివ్వకుండా నియమబద్ధ సముద్ర వ్యవస్థకు ప్రతీకగా నిలబెట్టడంలోనే అందరి శ్రేయస్సు ఉంది. సూయిజ్ నుంచి హోర్ముజ్ దాకా చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే.. సముద్ర జలసంధులను శాసించే శక్తులే రేపటి ప్రపంచ క్రమాన్ని నిర్దేశిస్తాయి. ఆ చైతన్యంతో వ్యవహరించడమే ఇండో-పసిఫిక్ యుగంలో భారత్ ముందున్న చారిత్రక కర్తవ్యం!

## పనికొచ్చే పలుకు



## సహనమే.. సంపూర్ణ బలం!

"ప్రకృతి నడకను అలవర్చుకోండి. దాని రహస్యం సహనం" అనే అమెరికన్ ప్రముఖ వ్యాసకర్త, అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ మాటలు నేటికీ ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తాయి. జీవితంలో సాధించాల్సిన అద్భుతాలు ఏవీ క్షణాల్లో జరగవని, ప్రతి మార్పునకు ఒక సమయం పడుతుందని ఈ సూక్తి స్పష్టం చేస్తోంది. ప్రకృతి లయను నమ్ముతూ సాగే ప్రయాణమే మనిషి అంతర్గత ఎదుగుదలకు తోడ్పడుతుంది. స్థిరమైన సంకల్పంతో అడుగులు వేసినప్పుడే జీవితంలో నిజమైన తృప్తి, సఫలత లభిస్తాయి. జీవితంలో అత్యంత గొప్ప విజయాలు రాత్రికి రాత్రే సొంతం కావు. అందుకే ప్రకృతి వేగాన్ని మనం అలవర్చుకోవాలి. సహనమనేది బలహీనత కాదు, అది మనిషికి ఉండే అతిపెద్ద శక్తి అని ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి నమ్మారు. ఫలితాలు వెంటనే కంటికి కనిపించకపోయినా, నిరంతరం శ్రమించాలనేదే ఆయన సిద్ధాంతం.

ఈ సూక్తి వెనుక ఉన్న లోతైన అర్థం

నిరంతర కృషి ఎప్పటికైనా మంచి ఫలితాలను ఇస్తుందనే సత్యాన్ని ప్రకృతి మనకు నిరూపిస్తుంది. ఒక చిన్న విత్తనం వృక్షంగా మారి ఫలాలను ఇవ్వడానికి ఎంతో సమయం పడుతుంది. ఈ క్రమంలో ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడుతుంది. మనిషి జీవితం కూడా సరిగ్గా ఇలాంటిదే. ఫలితం వెంటనే రావాలనే ఆరాటంలో చాలామంది నిరాశకు లోనవుతుంటారు. కానీ, కనిపించని శ్రమ వెనుక బలమైన పునాది ఏర్పడుతుందని ఎమర్సన్ బోధించారు.

వర్తమాన కాలంలో దీని ప్రాధాన్యత

వేగాన్నే విజయంగా భావిస్తున్న ప్రస్తుత రోజుల్లో ఎమర్సన్ మాటలు మనకు దిక్సూచిలా పనిచేస్తాయి. ఇక్కడ సహనమంటే కేవలం చేతులు ముడుచుకుని కూర్చోవడం కాదు. పూర్తి నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో, ఒక లక్ష్యం కోసం ఓపిగ్గా పని చేయడమే అసలైన సహనం. ప్రకృతి ఎప్పుడూ హడావుడి పడదు, కానీ సమయానికి తన పనులన్నీ పూర్తి చేస్తుంది. మన ఎదుగుదల కూడా క్రమంగానే సాగుతుంది.

షార్ట్‌కట్‌ల ద్వారా వచ్చే విజయాలు శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవు. స్థిరమైన సంకల్పంతో సాధించినప్పుడే ఆ విజయానికి అసలైన విలువ ఉంటుంది. గమ్యాన్ని చేరుకోవాలనే తొందరలో ప్రయాణంలోని పాఠాలను మర్చిపోకూడదు. ఎమర్సన్ చెప్పినట్లు ప్రకృతి నడకను మనం అందిపుచ్చుకుంటే, మన బంధాలు బలపడతాయి, నైపుణ్యాలు మెరుగవుతాయి, వ్యక్తిగత ఎదుగుదలకు అర్థం లభిస్తుంది. సహనమనేది నిష్క్రియగా వేచి ఉండటం కాదు, ప్రతి నిజాయితీగల ప్రయత్నం సరైన సమయంలో అద్భుతంగా వికసిస్తుందనే నిశ్శబ్ద నమ్మకం.

రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ప్రస్థానం

వ్యక్తిగత స్వేచ్ఛను, హేతుబద్ధమైన ఆలోచనలను బలంగా వినిపించిన ఎమర్సన్, అమెరికన్ రొమాంటిక్ మూవ్‌మెంట్‌లో కీలక వ్యక్తిగా నిలిచారు. ఆయన రాసిన "సెల్ఫ్-రిలయన్స్", "ది ఓవర్-సోల్", "సర్కిల్స్", "ది పోయెట్", "ఎక్స్‌పీరియన్స్" వంటి వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. ఇవన్నీ ఎస్సేస్: ఫస్ట్ సిరీస్ (1841), ఎస్సేస్: సెకండ్ సిరీస్ (1844) సంకలనాల్లో భాగం. ప్రసిద్ధ తత్వవేత్త హెన్రీ డేవిడ్ థోరోకు ఆయన గురువుగా, ప్రాణస్నేహితుడిగా వ్యవహరించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందిన ఎమర్సన్, 1836లో 'నేచర్' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఆ తర్వాత 1837లో హార్వర్డ్ కాలేజీలోని ఫి బేటా కప్పా సొసైటీలో "ది అమెరికన్ స్కాలర్" అనే ప్రసిద్ధ ప్రసంగాన్ని చేశారు.

# సంగమ సంకల్పం.. సంపద సృష్టి!




గోదావరి ఏటా వేల టీఎంసీ జలాలను వృథాగా సముద్రం పాలు చేస్తుంటే.. రాయలసీమ నేలలు చుక్కనీటి కోసం తపిస్తున్నాయి. ఈ వైరుధ్యానికి పరిష్కారమే నదుల అనుసంధానమన్నది దశాబ్దాల ఆలోచన. దాన్ని ఆచరణలోకి తెచ్చే మహాయజ్ఞానికి ఏపీ మరోసారి వేదికవుతోంది. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు.. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించడం రాష్ట్ర జలచరిత్రలో కీలక ఘట్టం. "అనుసంధానం పూర్తయితే రాష్ట్రానికి కరవుండదు" అన్న బాబు మాట ఈ యజ్ఞం వెనుక ఉన్న మౌలిక దృష్టిని ఆవిష్కరిస్తోంది. 2014లో విభజిత రాష్ట్ర తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే పూర్తి చేసిన పట్టిసీమ ఎత్తిపోతల -గోదావరి జలాలను పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణమ్మకు చేర్చడంతో.. దేశంలోనే అనుసంధానాన్ని ఆచరణాత్మకంగా నిరూపించిన తొలి ప్రయోగంగా చరిత్రకెక్కింది. కృష్ణా డెల్టా స్థిరీకరణకు ఆ జలాలు అండగా నిలవగా, శ్రీశైలం జలాలను సీమ అవసరాలకు మళ్లించే వెసులుబాటూ లభించింది. ఆనాటి విజయమే నేటి విస్తృత ప్రణాళికలకు ఆత్మవిశ్వాస పునాది. చంద్రబాబు సంకల్పంలోని మరో విశేషం రాష్ట్ర సరిహద్దులు దాటిన జాతీయ దృక్పథం. "గంగా-కావేరి అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదు" అన్న ఆయన వ్యాఖ్య ఇందుకు అద్దం. గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం యోచిస్తున్న వేళ.. కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు ఒకే వేదికపైకి రావడాన్ని చారిత్రక ఘట్టంగా అభివర్ణించిన ఆయన.. కేన్-బెత్వా తరహాలో ఈ అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అపార ప్రయోజనాలంటూ అనుసంధాన ఉద్యమానికి జాతీయ నేతృత్వం వహించాలన్న ఆకాంక్షను చాటారు.

ఈ ప్రస్థానంలో పోలవరం కేంద్రబిందువు. "పోలవరం రాష్ట్రానికి జీవనాడి" అంటున్న ముఖ్యమంత్రి.. మార్చి 2027 నాటికి ప్రాజెక్టును వందశాతం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టమైన గడువు ప్రకటించారు. గత హయాంలో నత్తనడకన సాగి, డయాఫ్రం వాల్ దెబ్బతిని సంక్షోభంలో పడిన ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించడం, కేంద్ర నిధులు రాబట్టడం, విదేశీ నిపుణుల సలహాలతో సాంకేతిక సమస్యలను అధిగమించడం గమనార్హం. పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 28.5 లక్షల మందికి తాగునీరు అందుతాయని అంచనా. ఎడమ కాలువ పనులు పూర్తికావడంతో ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇవ్వనున్నట్టు సీఎం ప్రకటించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా అనకాపల్లి, విశాఖలకు నీళ్లందించి, ఆపై గోదావరి-నాగావళి అనుసంధానం చేపడతామన్న రూట్‌మ్యాప్ కూడా వినిపించింది. వెలిగొండ ఫేజ్-1ను సెప్టెంబరు 1న జాతికి అంకితం చేయనుండటం ప్రకాశం జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు పెద్ద ఊరట. ఇక ఈ యజ్ఞంలో తలమానికం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు. పోలవరం వద్ద గోదావరి వరద జలాలను కృష్ణాలోకి, అక్కడి నుంచి బొల్లాపల్లి జలాశయానికి, ఆపై నల్లమల మీదుగా బనకచర్లకు తరలించి ఏటా 200 టీఎంసీ వరద జలాలను ఒడిసిపట్టాలన్నది బృహత్ ప్రణాళిక. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో మూడు దశల్లో దీన్ని చేపట్టనుండగా, సీఎం చైర్మన్‌గా 'జలహారతి కార్పొరేషన్' ఏర్పాటు ప్రభుత్వ చిత్తశుద్ధికి సంకేతం. బనకచర్ల జలాలు తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి వ్యవస్థల ద్వారా సీమ నలుమూలలకూ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకూ విస్తరిస్తే.. వలసబాట పట్టే సీమపల్లెల తలరాత మారుతుంది. అనుసంధాన ప్రయోజనాలు అనూహ్యమైనవి. వర్షాధార భూముల్లో పంట అనిశ్చితికి, రైతు ఆత్మహత్యలకు, వలసలకు వరద జలాలతో చెరువులు నింపడం ద్వారా అడ్డుకట్ట పడుతుంది. ఫ్లోరైడ్, ఉప్పునీటి బాధిత ప్రాంతాలకు నదీజలాలే శాశ్వత పరిష్కారం. నీటి లభ్యత పెరిగితే పంటల విస్తీర్ణం, దిగుబడులు పెరిగి.. ఉద్యాన, ఆక్వా, పాడి వంటి అధిక విలువ రంగాలకు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు, డేటా సెంటర్ల వంటి కొత్తతరం పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. అంటే అనుసంధానం కేవలం సాగునీటి పథకం కాదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రక్రియ. 'ప్రతి ఎకరాకూ నీరు' సాకారమైతే జీఎస్‌డీపీలో వ్యవసాయ వాటా పరుగులు పెడుతుంది. నీటి నిర్వహణలో ముందున్న సమాజాలే సంపద సృష్టిలోనూ ముందుంటాయన్నది ప్రపంచానుభవం. ఈ కోణంలో ఈ స్వప్నాన్ని 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌లో అంతర్భాగంగా చూడాలి.

అయితే ఈ బృహత్ స్వప్నం ముందున్న సవాళ్లనూ నిష్పాక్షికంగా గుర్తించాలి. మొదటిది నిధుల సమస్య. బనకచర్లకు రూ.81,900 కోట్లు, 36 ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు అంటే.. అప్పుల భారం, సంక్షేమ వ్యయాల ఒత్తిడి మధ్య ఉన్న ఖజానాకు భారీ పరీక్ష. కేంద్ర సాయం, హైబ్రిడ్ ఫండింగ్, అంతర్జాతీయ రుణ సంస్థల భాగస్వామ్యం లేకుండా ఇది సాగదు. రెండోది అంతర్రాష్ట్ర వివాదాలు. గోదావరిలో తమ వాటాకు గండి పడుతుందని, ట్రిబ్యునల్ కేటాయింపులకు విరుద్ధమని బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలు సుప్రీంకోర్టు దాకా వెళ్లాయి. 'వరద జలాలే తీసుకుంటాం, ఎవరి వాటాకూ నష్టం లేదు' అన్న ఏపీ వాదనకు.. ఏటా మూడు వేల టీఎంసీలకు పైగా జలాలు సముద్రం పాలవుతున్న గణాంకాల బలముంది. కానీ జల వివాదాల చరిత్ర చెప్పే పాఠం.. సాంకేతిక వాస్తవాల కంటే రాజకీయ విశ్వాసమే కీలకం. మూడోది పర్యావరణ, పునరావాస సవాళ్లు. నల్లమల మీదుగా టన్నెళ్లు, భారీ జలాశయాల నిర్మాణం అటవీ, వన్యప్రాణి అనుమతుల పరీక్షలు దాటాలి. ముంపు గ్రామాల పునరావాసం మానవీయంగా జరగాలి.. పోలవరం నిర్వాసితుల అనుభవాలు ఇక్కడ గుణపాఠాలు. నాలుగోది.. నదులు నీటి పైపులు కావని, జీవావరణ వ్యవస్థలని, వరద మళ్లింపు డెల్టాలపై, భూగర్భ జలాలపై ప్రభావం చూపవచ్చున్న నిపుణుల మౌలిక ప్రశ్న. ఈ సందేహాలకు సమాధానం సిద్ధాంత చర్చల్లో కాదు, జాగ్రత్తతో కూడిన ఆచరణలోనే దొరుకుతుంది. పట్టిసీమతో ఏపీ, కేన్-బెత్వాతో దేశం అనుసంధాన సాధ్యతను నిరూపించాయి. కావాల్సిందల్లా ప్రతి దశలో శాస్త్రీయ అధ్యయనాలు, పర్యావరణ మదింపులు, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ. వరద జలాలకే పరిమితమవుతూ, దిగువ డెల్టాలను కాపాడుతూ, భాగస్వామ్య రాష్ట్రాలతో నిరంతర సంప్రదింపులతో సాగితే ప్రాజెక్టు వివాదాల ఊబిలో కూరుకుపోదు.

ప్రకటనల్లో వేగం ఎంత ముఖ్యమో, నాణ్యతలో రాజీపడని నిదానమూ అంతే ముఖ్యమన్నదానికి పోలవరం డయాఫ్రం వాల్ అనుభవమే శాశ్వత హెచ్చరిక. భారీ ప్రాజెక్టుల వెలుగులో చెరువుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి, సూక్ష్మసేద్యం వంటి చిన్ననీటి వ్యూహాలను విస్మరించరాదు. తెచ్చిన నీటిని పొదుపుగా వాడే సంస్కృతి లేకపోతే ఎన్ని నదులు కలిపినా దాహం తీరదు. మొత్తంగా.. వృథా జలాలను వరప్రసాదాలుగా మార్చాలన్న చంద్రబాబు సంకల్పం ఔచిత్యంలో ప్రశ్నార్థం కాదు, ప్రశ్నలన్నీ అమలు మార్గంలోనే. నిధుల క్రమశిక్షణ, పొరుగు రాష్ట్రాలతో సఖ్యత, పర్యావరణ బాధ్యత, పారదర్శకత అనే నాలుగు స్తంభాలపై ఈ జలయజ్ఞం నడిస్తే.. పోలవరం జాతికి అంకితమయ్యే క్షణం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమవుతుంది. సంగమం వద్ద ఇచ్చిన జలహారతి.. తరతరాల కరవు కథకు ముగింపు పలికే మంగళహారతి కావాలని ఆకాంక్షిద్దాం. నదులు కలిస్తే నీరే కాదు, ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాలూ కలిసిపోతాయి. అదే ఈ మహాసంకల్పానికి అసలైన సార్థకత! ■



వారాంతపు పార్టీలకో, సినిమాలకో, మందు విందులకో వేలు ఖర్చు చేస్తే.. "భలే ఎంజాయ్ చేస్తున్నావ్" అని మెచ్చుకుంటుంది ఈ లోకం. అదే డబ్బును వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టినా, కొత్త నైపుణ్యం నేర్చుకోవడానికి వెచ్చించినా.. "అంత రిస్క్ ఎందుకు?" అంటూ భయపెడుతుంది. వినోదానికి వెచ్చిస్తే వివేకం, ఎదుగుదలకు వెచ్చిస్తే అవివేకం అనుకునే ఈ ఆలోచనే అసలైన విచిత్రం! సో, లోకం మాటలు పక్కనపెట్టండి. క్షణికానందం ఖర్చయిపోతుంది.. కానీ మీపై మీరు పెట్టే పెట్టుబడి వడ్డీతో సహా తిరిగొస్తుంది. ఖర్చుకూ పెట్టుబడికీ తేడా తెలిసిన రోజే.. మీ ఎదుగుదలకు తొలి మెట్టు పడినట్టు!

-మహాదేవ

## వింతల్లో వింతలు

### అరచేతిలో అద్భుతం!



గంటలు, నిమిషాలు, సెకన్లు చూపడం దాటి గడియారంలో ఉండే ప్రతి అదనపు ఫీచర్‌ను హోరాలజీ భాషలో 'కాంప్లికేషన్' అంటారు. తేదీ, అలారం, స్టాప్‌వాచ్ ఇలాంటివే. మరి ఏకంగా 63 కాంప్లికేషన్లున్న గడియారం గురించి విన్నారా? స్విస్ దిగ్గజం వాచరాన్ కాన్‌స్టాంటిన్ రూపొందించిన 'బెర్క్‌లీ గ్రాండ్ కాంప్లికేషన్' పాకెట్ వాచ్.. ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన గడియారంగా చరిత్ర సృష్టించింది. 2015లో ఓ అజ్ఞాత కలెక్టర్ కోసం ఎనిమిదేళ్లు శ్రమించి తయారు చేసిన 'రిఫరెన్స్ 57260' దీనికి పునాది. 18 క్యారెట్ల తెల్ల బంగారు కేసులో, కేవలం రెండు అంగుళాల వ్యాసంలో 2,870 సూక్ష్మ యాంత్రిక భాగాలను ఇమిడ్చిన ఈ 960 గ్రాముల అద్భుతం.. అంతకుముందు రికార్డు సాధించిన పటేక్ ఫిలిప్ 'క్యాలిబర్ 89' (33 కాంప్లికేషన్లు) కంటే దాదాపు రెట్టింపు ఫీచర్లతో అబ్బురపరుస్తోంది. దీని ధర గోప్యమే అయినా.. 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ.85 కోట్లు) పైమాటేనని నిపుణుల అంచనా. కాలం గడిచేకొద్దీ దీని విలువ మరింత పెరగడం ఖాయమంటున్నారు!

# రెండో వన్డే వాళ్లది

## భారత్‌పై ఇంగ్లాండ్ విజయం
## జో రూట్ సూపర్ ఇన్నింగ్స్
## కోహ్లి, శ్రేయస్ శ్రమ వృథా



ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్.. రెండో వన్డేలో కంగుతింది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి తర్వాత ముగిసిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 4 వికెట్ల తేడాతో ఓడింది. జో రూట్ (99 నాటౌట్; 133 బంతుల్లో 9ఐ4) సూపర్ ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ 234 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదట జోఫ్రా ఆర్చర్ (3/47), గస్ అట్కిన్సన్ (3/50), సకిబ్ మహమూద్ (3/52)ల ధాటికి భారత్ 44 ఓవర్లలో 233 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (65; 66 బంతుల్లో 8ఐ4), శ్రేయస్ అయ్యర్ (66; 71 బంతుల్లో 5ఐ4, 2ఐ6) మెరిశారు. ఛేదనలో ఓపెనర్లు బెన్ డకెట్ (0), జాకబ్ బెతెల్ (4) ఆరంభంలోనే ఔటైపోవడం.. కెప్టెన్ బ్రూక్ (16) కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో ఇంగ్లాండ్ 53/3తో కష్టాల్లో పడింది. కానీ తొలి వన్డేలో మాదిరే జో రూట్ పట్టుదలతో నిలవడంతో ఇంగ్లాండ్ విజయానికి దారులు తెరుచుకున్నాయి. సామ్ కరన్ (26), జోస్ బట్లర్ (17), విల్ జాక్స్ (30), గస్ అట్కిన్సన్ (23 నాటౌట్)ల సహకారంతో రూట్ జట్టును గెలిపించాడు. బుమ్రా (1/45), అక్షర్ పటేల్ (1/35), గుర్నూర్ బ్రార్ (2/67), ప్రసిద్ధ్ కృష్ణ (1/52) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి తెచ్చినా.. రూట్ గొప్ప పట్టుదలతో ఆడి ఆతిథ్య జట్టుకు విజయాన్నందించాడు.

నిలబడి, తడబడి..: టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌ను చక్కగా ఆరంభించి, ఒక దశలో అలవోకగా 300 స్కోరు చేసే స్థితిలో కనిపించింది. అయితే 30 ఓవర్ల వరకు ఆధిపత్యం చలాయించిన జట్టు.. తర్వాత అనూహ్యంగా తడబడింది. భారత ఇన్నింగ్స్‌కు మంచి ఆరంభమే దక్కింది. ఫామ్‌తో తంటాలు పడుతున్న రోహిత్ (26; 47 బంతుల్లో 1ఐ4, 1ఐ6) అవతలి ఎండ్‌లో అంత సౌకర్యంగా కనిపించకపోయినా.. కెప్టెన్ శుభ్‌మన్ (31; 30 బంతుల్లో 6ఐ4) మాత్రం చక్కటి స్ట్రోక్ ప్లేతో అలరించాడు. జోరుమీదున్న గిల్‌ను అట్కిన్సన్ ఔట్ చేసినా.. మూడో స్థానంలో వచ్చిన కోహ్లి నిలకడగా ఆడి జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు.

విరాట్ తనదైన శైలిలో డ్రైవ్ షాట్లు ఆడుతూ, బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్.. అట్కిన్సన్ బౌలింగ్‌లో ఒక సిక్సర్ బాదినా, ఆ తర్వాత మళ్లీ తడబాటును కొనసాగించాడు. స్పిన్నర్ జాక్స్ బౌలింగ్‌లో రోహిత్ స్వీప్ చేయబోయి వికెట్ కీపర్‌కు దొరికిపోవడంతో 104 పరుగుల వద్ద భారత్ రెండో వికెట్ కోల్పోయింది. కాసేపటికే ఇషాన్ (1) కూడా ఔటైపోయినా.. కోహ్లికి శ్రేయస్ జతకలవడంతో భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. ఇద్దరూ నిలకడగా ఆడుతూ జట్టును పటిష్ఠ స్థితికి చేర్చారు. కోహ్లి సరిగ్గా 50 బంతుల్లో అర్ధశతకాన్నందుకున్నాడు. శ్రేయస్ కూడా అర్ధసెంచరీకి చేరువ కాగా.. 31 ఓవర్లకు భారత్ 177/3తో 300 స్కోరుపై కన్నేసింది. కానీ తర్వాతి ఓవర్లో ఆర్చర్.. కోహ్లిని ఔట్ చేయడంతో ఆట మలుపు తిరిగింది. తర్వాత చకచకా వికెట్లు పడ్డాయి.

గత మ్యాచ్‌లో విలువైన అర్ధశతకాలు సాధించిన సుందర్ (1), అక్షర్ (1) ఈసారి తేలిపోయారు. అక్షర్‌తో పాటు దూబె (0)ను ఆర్చర్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. ఒక ఎండ్‌లో శ్రేయస్ పోరాడుతున్నా.. అతడికి సహకరించేవారు కరవయ్యారు. 210 పరుగుల వద్ద భారత్ ఎనిమిదో వికెట్ కోల్పోగా.. సకిబ్ వేసిన 43వ ఓవర్లో బుమ్రా మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగిపోవడంతో 18 పరుగులు వచ్చాయి. 43 ఓవర్లకు 232 పరుగులు చేసిన భారత్.. 270–280 పరుగులు చేస్తుందనిపంచింది. కానీ తర్వాతి ఓవర్లో అట్కిన్సన్.. శ్రేయస్, ప్రసిద్ధ్ (0)లను ఔట్ చేయడంతో 6 ఓవర్లు ఉండగానే ఇన్నింగ్స్‌కు తెరపడింది.

# రోహిత్ శర్మ.. లార్డ్స్ వన్డేనే ఆఖరా?



దిల్లీ: వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో ఆడాలన్నది మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆశ. కానీ లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగే చివరి వన్డేనే కెరీర్‌లో అతడికి చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చు. ఇంగ్లాండ్‌తో సిరీస్ తర్వాత సెలక్షన్ కమిటీ అతణ్ని జట్టుకు ఎంపిక చేసే అవకాశం లేదని సమాచారం. ప్రస్తుతం కార్డిఫ్‌లో ఉన్న చీఫ్ సెలక్టర్ అగార్కర్ ఈ విషయంలో స్పష్టతతో ఉన్నాడట. “మూడు ఇన్నింగ్స్‌ల్లో రెండు శతకాలు సాధించిన యశస్వి జైస్వాల్‌కు చాలా అవకాశాలు ఇవ్వాలని జాతీయ సెలక్టర్లు భావిస్తున్నారు. ప్రపంచకప్‌నకు ముందు దాదాపు 20 మ్యాచ్‌లు ఉన్నాయి. ఆ మ్యాచ్‌ల్లో యశస్విని ఆడించాల్సిన అవసరముంది” అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. అయితే రోహిత్ తన భవిష్యత్తుపై తానే నిర్ణయం తీసుకోవాలని, రిటైర్ కావాలని అతడికి ఎవరూ చెప్పరని ఆ అధికారి వ్యాఖ్యానించాడు. రోహిత్ తాను ఆడిన గత ఎనిమిది వన్డే మ్యాచ్‌ల్లో 30.1 సగటుతో 241 పరుగులు చేశాడు.

# వైభవ్ సూర్యవంశీపై ఎఫ్1 రేసర్ ప్రశంసలు



ఫార్ములా వన్ (ఫ్1) రేసింగ్ బుల్స్ డ్రైవర్ ఆర్విద్ లిండ్‌బ్లాడ్, భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు కురిపించాడు. మెరుగైన సాంకేతికత, చిన్న వయసులోనే సమాచారం అందుబాటులో ఉండటం వల్లే నేటి తరం అథ్లెట్లు క్రీడల్లో వేగంగా రాణిస్తున్నారని, వైభవ్ దీనికి చక్కటి ఉదాహరణ అని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్, భారత్ మధ్య జరిగిన మొదటి వన్డే సందర్భంగా ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

భారత సంతతికి చెందిన ఆర్విద్ మాట్లాడుతూ.. “ఈ మార్పు అన్ని క్రీడల్లోనూ కనిపిస్తోంది. టెక్నాలజీ మెరుగుపడటంతో చిన్న వయసులోనే మెరుగైన సమాచారం, శిక్షణ అందుబాటులోకి వస్తున్నాయి. అందుకే యువకులు అద్భుతంగా రాణిస్తున్నారు. క్రికెట్‌లోనూ 15 ఏళ్లకే వైభవ్ సూర్యవంశీ అద్భుతంగా ఆడుతున్నాడు. ఇది క్రీడల్లో వస్తున్న సహజమైన మార్పు” అని వివరించాడు. ఇదే సమయంలో తన భారతీయ మూలాల గురించి కూడా ఆర్విద్ పంచుకున్నాడు. “మా నానమ్మ, తాతయ్య పంజాబీలు. నా భారతీయ మూలాలతో నాకు బలమైన అనుబంధం ఉంది. మా నానమ్మ చేసే భారతీయ వంటకాలంటే నాకు చాలా ఇష్టం” అని చెప్పాడు. గతేడాది ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో పిల్లలతో కలిసి క్రికెట్ ఆడిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. ఇటీవల బ్రిటిష్ గ్రాండ్ ప్రీలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను కలిశానని, ఇద్దరి కుటుంబ మూలాలు పంజాబ్‌కు చెందినవే కావడం సంతోషంగా ఉందని తెలిపాడు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన కార్లను నడిపినా, తనకు ఇంకా పబ్లిక్ రోడ్ డ్రైవింగ్ లైసెన్స్ రాలేదని ఆర్విద్ నవ్వుతూ చెప్పాడు. “నిన్ననే నా మొదటి రోడ్ డ్రైవింగ్ పాఠం తీసుకున్నా. ఇది కాస్త సిల్లీగా అనిపిస్తోంది, త్వరలోనే లైసెన్స్ పొందాలి” అని సరదాగా వ్యాఖ్యానించాడు.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!



నాభా నటేష్ ‘గోల్డెన్ అవర్’ గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థతులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయమైన రూపం

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com